# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 99 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శుక్రవారం 30 మే 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 99 29-05-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




**సీఐఐ భేటీకి సీఎం చంద్రబాబు..**

**కడప నుంచి నేరుగా ఢిల్లీకి పయనం**

3 లో..




# వీళ్లు.. అంతకంటే.. హానికరం

## రాష్ట్రం నుంచి..

# తరిమి కొడదాం..



- కడపలో ముగిసిన టీడీపీ మహానాడు
- ముగింపు సభలో చంద్రబాబు ప్రసంగం
- ఆర్థిక ఉగ్రవాదులపై 'ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్' కు పిలుపు
- కడప మహానాడు వేదికగా గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటన
- టీడీపీ కార్యకర్తల త్యాగాలతోనే ప్రజాపాలన సాధ్యమైందని వ్యాఖ్య

పాకిస్థాన్ ఉగ్రవాదులను ఏరిపారేసిన 'ఆపరేషన్ సింధూర్' తరహాలో రాష్ట్రంలో 'ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్' చేపట్టి, ఆర్థిక ఉగ్రవాదులను రాజకీయాల నుంచి తరిమికొట్టాలని ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పిలుపునిచ్చారు. ఉగ్రవాదులు దేశానికి ఎంత ప్రమాదకరమో, రాజకీయ ముసుగులో ఉన్న ఆర్థిక నేరగాళ్లు సమాజానికి అంతకంటే ఎక్కువ హానికరమని ఆయన అన్నారు. కడప శివార్లలో గురువారం జరిగిన మహానాడు మూడో రోజు బహిరంగ సభలో ఆయన పార్టీ శ్రేణులను, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

**కడప, మే 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గత ప్రభుత్వ హయాంలో ల్యాండ్, శాండ్, వైన్, మైన్ కుంభకోణాలతో రాష్ట్రాన్ని దోచుకున్నారని చంద్రబాబు ఆరోపించారు. ప్రజలు నమ్మి ఓటేస్తే జె బ్రాండ్ల మద్యం, గంజాయి, డ్రగ్స్‌తో వారి ఆరోగ్యాలను నాశనం చేశారని విమర్శించారు. అడవులను ఆక్రమించి ఎస్టేట్‌లు

3 లో





ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి

# కట్టుబడి ఉన్నాం..

## ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ మే 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కోలకతా - భారత్‌లో ఉగ్రవాదం వ్యాప్తికి సహకరించే వారికి 'ఆపరేషన్ సిందూర్' తగిన సమాధానం అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదంపై పోరాడేందుకు దేశం మొత్తం ఏకమైందని పేర్కొన్నారు. సిక్కిం రాష్ట్రంలో పలు అభివృద్ధికారక ప్రాజెక్టులకు నేడు ప్రధాని పశ్చిమ బెంగాల్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. నమ్చి

- తరువాయి 2లో..

అటవీ శాఖ సిబ్బందిపై

# తిరుగబడ్డ ఏనుగులు

ఇద్దరు గార్డులకు తీవ్ర గాయాలు

బోయినపల్లి అటవీ ప్రాంతంలో ఘటన

ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు

**తిరుపతి మే 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తిరుపతి తిరుపతి జిల్లాలో ఏనుగుల గుంపు మరోసారి బీభత్సం సృష్టించాయి. తిరుపతి జిల్లా ఎర్రావారిపాలెం మండలంలో ఏనుగులు నేడు హల్‌చల్ చేశాయి. ఈ మేరకు స్థానిక ప్రజలు ఇచ్చిన



- తరువాయి 2లో..

# ఏపీలో ప్లాష్ ఫ్లడ్స్ ప్రమాదం

## హెచ్చరికలు జారీ

**అమరావతి మే 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్ర ప్రదేశ్ అంతటా నైరుతి రుతుపవనాలు వ్యాపించాయి. దీంతో ఆకాశంలో నల్లని మబ్బులు కమ్మేసి వాతావరణం పూర్తిగా చల్లబడింది%ా% వర్షాలు మరింత జోరందుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచికొడతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ముఖ్యంగా కోస్తాంధ్రలో భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు.



**బలపడిన అల్పపీడనం ..**

మరోవైపు వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొద్దిసేపటి క్రితం బంగ్లాదేశ్ వద్ద తీరాన్ని దాటింది.. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులు కోస్తాంధ్రలో భారీ వర్షాలు పడే అవకాశం ఉంది, భారీ వర్షాల నేపధ్యంలో ఆకస్మిక వరదలు, కోస్తాంధ్రలో భారీ వర్షాలతో పాటుగా, ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది . శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం,

- తరువాయి 2లో..

## మన జెండా పీకేస్తాం అన్నోళ్లు అడ్రస్ లేకుండా పోయారు: నారా లోకేశ్

కడపలో మహానాడు చివరి రోజు నారా లోకేశ్ ప్రసంగం

వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందని తీవ్ర విమర్శలు

సీబీఎన్ ఒక బ్రాండ్ అని, అభివృద్ధి, సంక్షేమం ఆయనతోనే సాధ్యమని వెల్లడి

ప్రభుత్వ కొనసాగింపుతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని స్పష్టం



**అమరావతి మే 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తెలుగుదేశం పార్టీ జెండా పీకేస్తామని, పార్టీని లేకుండా చేస్తామని అన్నవారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కడపలో జరిగిన మహానాడు వేదికగా ఆయన మాట్లాడుతూ, వై నాట్ 175 అన్నవారికి ప్రజలు ప్రతిపక్ష హెూదా కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎదుర్కొన్న సవాళ్లను, కార్యకర్తల త్యాగాలను స్మరించుకుంటూ, రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రగతికి

- తరువాయి 2లో..

## ఆదివారం నాడూ రేషన్ షాప్స్ ఓపెన్

### మంత్రి నాదెండ్ల మనోహర్

వెల్లడించిన మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

ప్రతి నెల 15 వ తేది వరకు రేషన్ పంపిణీ

సీనియర్ సిటిజెన్స్, వికలాంగులకు ఇంటికే నిత్యావసరాలు




**విజయవాడ, మే 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల ద్వారానే నిత్యావసర వస్తువులను పంపిణీ చేయనున్న తరుణంలో, లబ్ధిదారుల సౌకర్యార్థం ఎపి ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఇకపై ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు, ఆదివారాల్లోనూ రేషన్ దుకాణాలు పూర్తిస్థాయిలో పనిచేస్తాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు.

- తరువాయి 2లో..

## రాజారెడ్డికి విజయమ్మ, షర్మిల నివాళులు

సమాధి వద్ద నివాళి కార్యక్రమానికి దూరంగా జగన్



**కడప, మే 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

వైఎస్ రాజారెడ్డి శతజయంతి వేడుకలకు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి సతీమణి వైయస్ విజయమ్మ, కుమార్తె వైఎస్ షర్మిల రెడ్డిలు గురువారం హాజరై పట్టణంలోని డిగ్రీ కాలేజ్ రోడ్డు సమీపంలో ఉన్న వైయస్ రాజారెడ్డి ఘాట్ వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించి, ప్రత్యేక ప్రార్థనలు

- తరువాయి 2లో..

# సంపాదకీయం

## ముందస్తు రుతుపవనాలు మేలేనా?

నైరుతి పవనాలు వేగంగా ప్రవేశించడం ఈ ఏడాది సాధారణం కన్నా ఎక్కువగానే వర్షపాతం ఉంటుందని, వ్యవసాయ రంగానికి అధిక ప్రయోజనం కలుగుతుందని ఆశిస్తున్నారు. అయితే వ్యవసాయ దిగుబడులు ఒక్క రుతుపవనాలపైనే కాకుండా అనేక అంశాలపై ఆధారపడి ఉంటున్నాయి. వాతావరణ పోకడలో మార్పులు సుదీర్ఘకాల సవాళ్లకు దారితీయవచ్చు. అయితే ఈ సందర్భంగా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా నెలవారీ బులెటిన్‌లో వెలువడిన పరిశోధన నివేదిక వాతావరణ క్రమ రాహిత్యాలు సాధారణ స్థాయిల నుంచి వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో ఎలా విచలనం కలిగిస్తాయో వెల్లడించింది. వ్యవసాయ ఉత్పత్తులు ముఖ్యంగా కూరగాయల సరఫరాలో ఆటంకాలు ఏర్పడి ధరలు పెరిగే అవకాశం ఉంటుందని నివేదిక అంచనా వేసింది. 2014 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు లభించిన డేటా ఉపయోగించి ఆహార ధరల్లో నిలకడ ఉండదని, ముఖ్యంగా ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పుల ఫలితంగా సరఫరా అస్తవ్యస్తంతో కూరగాయల ధరలు బాగా పెరిగిపోతాయని పేర్కొంది. వర్షపాతం మార్పుల కన్నా ఉష్ణోగ్రతల మార్పులే తీవ్ర ప్రభావం చూపిస్తాయి. వాస్తవ అంచనా ప్రకారం ఒక యూనిట్ ఉష్ణోగ్రత పెరిగితే వెజిటబుల్ కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (సిపిఐ) 1.3% వంతున నెలనెలా పెరిగిపోతుంది. అలాగే వర్షపాతంలో ఒక యూనిట్ పెరిగితే సిపిఐ 1.24 శాతం పెరిగిపోతుంది. 2022 నుంచి ఉష్ణోగ్రతల్లో మార్పులు కూరగాయల ధరలపై తీవ్ర ప్రభావం చూపించాయి. ఉష్ణోగ్రత విఘాతాలు పంటలు పెరిగే కీలక సమయాల్లో తీవ్ర ప్రభావం చూపిస్తాయి. అసాధారణ వాతావరణ పరిస్థితులు అంతగా నిల్వ ఉండని ఆహార పంటలపై వ్యతిరేక ప్రభావాన్ని చూపించాయని ఈ ఏడాది ఎకనామిక్ సర్వే కూడా స్పష్టం చేసింది. తృణధాన్యాలు, పప్పుధాన్యాలకు భిన్నంగా కూరగాయల దిగుబడుల కాలం తక్కువగా ఉంటుంది.

అకస్మాత్తుగా వాతావరణంలో తేడాలు కనిపిస్తే అత్యంత దుర్బల పరిస్థితిని ఎదుర్కొంటాయి. వడగాడ్పులు పెరిగితే అత్యధిక ఉష్ణోగ్రతలతో పంటలకు నీటి ఒత్తిడి పెరిగి దిగుబడులు తగ్గుతాయి. ఈలోగా అకాల వర్షాలు, వరదలు, కోతకు వచ్చే పంటలకు విపరీత నష్టాన్ని కలిగిస్తాయి. సరఫరా వ్యవస్థకు ఆటంకాలు ఎదురై పంటలకు విపరీత నష్టాలు సంభవిస్తుంటాయి. కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్‌కు సంబంధించి ఆహార ఉప పంటలలో కూరగాయల అధిక ధరలు తక్షణం ద్రవ్యోల్బణం అధికస్థాయిలో పెరిగిపోడానికి దారితీస్తుంది. ఉదాహరణకు ఎల్‌నినో సంవత్సరంగా గుర్తింపబడిన 202324 లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదై అస్థిర వర్షపాతం సంభవించింది. దాంతో దశాబ్ద కాలంలో ఎన్నడూ లేని విధంగా కూరగాయాల దిగుబడి బాగా తగ్గిపోయింది.

అత్యంత అవసరాలైన టొమాటో, ఉల్లి, వెల్లుల్లి ధరల్లో అధిక ద్రవ్యోల్బణం కనిపించింది. పండ్ల దిగుబడి బాగా ఉన్నా తోటల ఉత్పత్తులపై ఈ ప్రభావం పడింది. ప్రపంచం మొత్తంమీద కూరగాయలు, పండ్ల ఉత్పత్తిలో భారత్ రెండోస్థానం వహిస్తోంది. గత కొన్నేళ్లుగా ఉద్యానవనాలు, తోటల దిగుబడులు నిదానంగా పెరుగుతున్నాయి. అయితే వాతావరణ మార్పులతో అకస్మాత్తుగా ఉత్పత్తి దెబ్బతినడం ఆందోళన కలిగిస్తోంది. ఇది చివరకు వినియోగదారులను ఆశాభంగం కలిగించడమే కాక, ముఖ్యంగా చిన్నతరహా, సామాన్య రైతుల ఆదాయం కూడా తగ్గిపోతోంది. అసమాన ప్రకృతి స్వభావం వల్లనే ధరల్లో నిలకడ లేకుండా పోతోంది. పరిస్థితులు సాధారణమైనా ధరలు తగ్గడం లేదు. విచ్ఛిన్నమైన సరఫరా గొలుసులు, పంట తర్వాత అధిక నష్టాలు, కోల్డ్ స్టోరేజి సామర్థ్యం తగినంతగా లేకపోవడం ఈ దుర్బలత్వానికి కారణమని చెప్పవచ్చు.

అందువల్ల ఈ సమస్యల పరిష్కారానికి అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే పంట రకాలను స్వీకరించవలసి ఉంది. అలాగే అత్యధిక వేడిని, కరువును తట్టుకునే కూరగాయల రకాలను విస్తరింప చేయాలి. ఈ మేరకు అధిక దిగుబడినిచ్చే విత్తనాలపై జాతీయ మిషన్ సహకారం తీసుకోవాలి. తెగుళ్లను తట్టుకునే, వాతావరణ మార్పులను ఎదుర్కొని నిలబడగలిగే అధిక దిగుబడినిచ్చే హైబ్రిడ్ రకాల విత్తనాలపై జాతీయ మిషన్ పరిశోధనలు సాగిస్తోంది. దీనివల్ల ఆహార భద్రత లభిస్తుంది. ఈ జాతీయ మిషన్ కోసం 202526 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రూ. 100 కోట్లు కేటాయించింది. ఈ నేపథ్యంలో ప్రతికూల పరిస్థితులను తట్టుకుని అత్యధిక దిగుబడినిచ్చే వంగడాలను రైతులు స్వీకరించడం ఎంతో అవసరం. దీంతోపాటు మార్కెట్ అనుసంధానం, రవాణా, నిల్వకు తగిన గిడ్డంగులు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్ ఇవన్నీ విస్తృతం చేయాలి. అంతర్జాతీయ స్థాయిలో సేద్యంలో ఇజ్రాయెల్, నెదర్లాండ్స్ వంటి దేశాలు అత్యంత ఆధునిక పద్ధతులను అనుసరిస్తున్నాయి.

ఈ దేశాలు అనుసరిస్తున్న గ్రీన్‌హౌస్ కూరగాయల సాగును అమలు చేస్తున్నాయి. ఇటువంటి అత్యంత ఆధునిక పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి. గ్రీన్‌హౌస్ అనేది పండ్లు, కూరగాయలకు రక్షణ కల్పించే గాజు లేదా ప్లాస్టిక్‌తో కూడిన అపారదర్శక బాహ్యకవచం. ఇది మొక్కల పెరుగుదలకు దోహదం చేసే, పర్యావరణ ప్రమాదాలనైనా నియంత్రిం చే రక్షిత ప్రదేశం. క్రిమికీటకాల నుండి, తెగుళ్ల నుండి ఈ గ్రీన్ హౌస్ పద్ధతిలో రక్షణ లభిస్తుంది. అలాగే భారీ వర్షాల నుండి, పెనుగాలుల నుండి కవచంలా గ్రీన్‌హౌస్ సీలింగ్ కాపాడుతుంది. ఇటువంటి ఆధునిక విధానాల వల్ల వాతావరణ ప్రతికూలతలు తేలికవుతాయి. ఏడాది పొడుగునా నికరమైన దిగుబడులు వస్తాయి. చివరకు ధరలు నిలకడగా ఉండి వినియోగదారుల సంక్షేమంతోపాటు రైతుల ఆదాయానికి కూడా భద్రత లభిస్తుంది. వ్యవసాయం లాభసాటిగా సాగాలంటే గ్రీన్‌హౌస్, హైడ్రోపోనిక్, ఆక్వాపోనిక్ వ్యవసాయం వంటి ఆధునిక పద్ధతులను మనదేశంలో అవలంబించడం ఎంతైనా అవసరం.

## కడపలో మహానాడు వేదికపై స్పృహతప్పి పడిపోయిన జలీల్ ఖాన్

### కడప మహానాడులో మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్‌కు అస్వస్థత

### వేదికపై ప్రసంగిస్తుండగా ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయిన వైనం

### వెంటనే స్పందించిన టీడీపీ శ్రేణులు, హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు







కడప మే 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తెలుగుదేశం పార్టీ కడపలో నిర్వహిస్తున్న మహానాడులో స్వల్ప అపశ్రుతి చోటుచేసుకుంది. పార్టీ సీనియర్ నేత, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు జలీల్ ఖాన్ వేదికపైనే అస్వస్థతకు గురై స్పృహ తప్పి పడిపోయారు. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే, కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమంలో భాగంగా జలీల్ ఖాన్ వేదికపై ఉన్నారు. ఈ క్రమంలో ఆయన హఠాత్తుగా కుప్పకూలిపోయారు. ఇది గమనించిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంటనే అప్రమత్తమయ్యారు. తక్షణమే స్పందించి, జలీల్ ఖాన్‌ను హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఆయన ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. జలీల్ ఖాన్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుపరిచితమైన వ్యక్తి. గతంలో ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1999లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్ర విభజన అనంతరం, 2014 ఎన్నికల్లో వైసీపీ నుంచి విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో 2016లో తెలుగుదేశం పార్టీలో చేరారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జలీల్ ఖాన్‌ను ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా కూడా నియమించారు. ఈ పదవి ముస్లిం మైనారిటీ వర్గాల్లో ప్రాముఖ్యత కలిగినదిగా పరిగణిస్తారు.

## ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

జిల్లాలో రూ.750 కోట్లతో నిర్మించనున్న 500 పడకల జిల్లా ఆసుపత్రి, సాంగాచోలింగ్‌లోని ప్యాసెంజర్ రోప్‌వే, గాంగ్‌టాక్ జిల్లాలోని అటల్ అమృత్ ఉద్యానవనంలో మాజీ ప్రధాని అటల్ బీహారీ వాజ్‌పేయి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన సిక్కిం రాష్ట్ర హోదా పొంది 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా ప్రసంగిస్తూ,. హిమాలయ రాష్ట్రమైన సిక్కిం దేశానికి గర్వకారణమన్నారు. ఇక్కడి ప్రజలు ప్రజాస్వామ్యాన్ని విశ్వసిస్తారని పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాలే కేంద్రంగా ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇటీవల ఈశాన్య రాష్ట్రాల ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ఢిల్లీలో జరిగిందన్న విషయాన్ని కూడా మోదీ పేర్కొన్నారు. ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. దీంతో, రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయని తెలిపారు. 'గత నెలలో పహల్గాం దాడి తర్వాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్.. భారత్‌లో ఉగ్రవాదాన్ని వ్యాప్తిచేసేవారికి తగిన సమాధానం. పహల్గాంలో ఉగ్రవాదులు చేసింది మానవత్వంపై దాడి. ఇప్పుడు ఉగ్రవాదంపై పోరాడేందుకు దేశం మొత్తం ఏకమైంది' అని చెప్పుకొచ్చారు.

**వాతావరణం అనుకూలించకపోవడంతో..**

%వాస్తవానికి ప్రధాని మోదీ నేడు సిక్కింలో నేరుగా పర్యటించాల్సి ఉంది. అయితే, వాతావరణం అనుకూలించని కారణంగా ఈ పర్యటన రద్దైంది. దీంతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిక్కిం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సాహస క్రీడలకు హబ్‌గా మారే అవకాశాలు సిక్కింకు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. 'గ్యాంగ్‌టక్ లో జరుగుతున్న ఈ కార్యక్రమంలో నేను నేరుగా పాల్గొనాలనుకున్నాను. అందుకు వాతావరణం సహకరించలేదు. సిక్కిం సాహస క్రీడలకు కేంద్రంగా మారే అవకాశం ఉంది. మిగిలిన ఈశాన్య రాష్ట్రాలు కూడా ఈ దిశగా ముందుకు సాగాలని కోరుకుంటున్నాను' అని ప్రధాని పేర్కొన్నారు.

## అటవీ శాఖ సిబ్బందిపై తిరుగబడ్డ ఏనుగులు

సమాచారంతో అక్కడికి వెళ్లిన అటవీశాఖ సిబ్బంది.. డ్రోన్ కెమెరాల ద్వారా ఏనుగుల గుంపును గుర్తించిన అటవీశాఖ సిబ్బంది వాటిని అడవిలోనికి తరిమేసేందుకు ప్రయత్నిస్తూ ఉండగా అటవీశాఖ సిబ్బందిపై ఏనుగులు తిరగబడ్డాయి. దీంతో ఫారెస్ట్ సిబ్బంది ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరిగెత్తారు. ఈ దాడి ఘటనలో ఎలిఫెంట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది గాయపడ్డారు. సెక్షన్ ఆఫీసర్ మునుస్వామి, గార్డు లక్ష్మీప్రసాద్‌కు కూడా గాయాలయ్యాయి. బోయినపల్లి అటవీ ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తున్నాయని జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ క్రమంలో ఉస్తికాయలపెంట, కోటకాడ పల్లి, యలమంద గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

## ఏపీలో ప్లాష్ ఫ్లడ్స్ ప్రమాదం.. హెచ్చరికలు జారీ

అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తారు నుంచి భారీ వర్షాలు, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, శ్రీసత్యసాయి జిల్లాల్లో మోస్తారు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

**ఏపీకి ప్లాష్ ఫ్లడ్స్..**

%ఏపీతో పాటు ఎగువన తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆకస్మిక వరదల అవకాశం ఉంది. గోదావరి, నాగావళి, వంశధార నదీ పరివాహక లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని



సూచించింది. నదీ తీరాలు, సరస్సులు, చెరువులు, కాలువల్లో కొట్టుకుపోయే కేసులను తగ్గించడానికి, ప్రమాదాన్ని కలిగించే నీటి వనరులు తక్షణం గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచనలు జారీ చేసారు.. ఈ హెచ్చరిక బోర్డుల్లో భద్రతా సూచనలు, సహాయం కోసం అత్యవసర నెంబర్ల సమాచారం ఉంటుంది. ఇక ఎగువ నుంచి వచ్చే నీటితో గోదావరి, కృష్ణా నదుల్లోకి భారీగా నీటిమట్టం పెరుగుతోంది. అలాగే వాగులు వంకలు వరదనీటితో ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది.





## మన జెండా పీకేస్తాం అన్నోళ్లు అడ్రస్ లేకుండా పోయారు: నారా లోకేశ్

తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

**మాస్ జాతర అదిరిపోయింది!**

తిరుమల తొలిగడప దేవుని కడప... ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం, అమీన్ పీర్ దర్గా, మరియాపురం చర్చి నెలకొన్న పుణ్యభూమి కడప. పౌరుషం, ఆత్మీయతలను కలగలిపి మహిళలను గౌరవించి గొప్పనేల కడప. కడప మాస్ జాతర మహానాడు అదిరిపోయింది. పౌరుషాల గడ్డపై పసుపు సైన్యం గర్జించింది, దేవుని గడప కడపలో పసుపు పండగ జరుపుకోవడం మన అదృష్టం. 2024లో మాస్ విక్టరీ సాధించాం, రికార్డులు బద్దలు కొట్టాం... చరిత్రను తిరగరాసాం. 94 పర్సెంట్ స్ట్రైక్ రేట్...164 అవుటాఫ్ 175. ఇది కేవలం రికార్డ్ కాదు ఆల్ టైం రికార్డ్. ఇది తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నాటుదెబ్బ. జెండా పీకేస్తాం అన్నారు ... పార్టీ కార్యాలయానికి టు లెట్ బోర్డు పెట్టుకున్నారు. పార్టీ లేకుండా చేస్తామన్నోళ్లు అడ్రెస్ లేకుండా పోయారు. వై నాట్ 175 అన్నారు ... ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. మన బొమ్మలు పెట్టి బాక్సింగ్ చేసారు... ఎన్నికల్లో ప్రజలు ఫుట్ బాల్ ఆడుకున్నారు. ఏ తప్పు చేయని మన అధినేతను అరెస్ట్ చేసారు... ప్రజలు వాళ్ళ నాయకుడిని ప్యాలస్ లో పెట్టి తాళం వేసారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి, గౌరవ మంత్రులు, గౌరవ ఎమ్మెల్యేలు, 82 బ్యాచ్ సీనియర్ నాయకుల దగ్గర నుండి 2025 బ్యాచ్ జూనియర్లకు, ప్రజలకు, అందరి కంటే ముఖ్యం, ఎత్తిన జెండా దించకుండా, మడమ తిప్పకుండా తెలుగుదేశం పార్టీకి కాపలా కాస్తున్నప్రాణసమానమైన కార్యకర్తలకు నా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

**దేవుని గడప సాక్షిగా ప్రజలకు 4ప్రశ్నలు**

దేవునికడప సాక్షిగా ఇక్కడి ప్రజలను నాలుగు ప్రశ్నలను అడగాలనుకుంటున్నా. 1). తల్లిని చెల్లిన మెడబట్టి బయటకు గెంటిదెవరు? 2). సొంత బాబాయిని గొడ్డలిపోటుతో లేపేసిందెవరు? 3). జె-బ్రాండ్స్ తో పేదల రక్తం తాగిందెవరు? 4). బల్లకింద రెడ్ బటన్ నొక్కి ప్రజలను బాదిందెవరు?

**సీబీఎన్ అంటే ఒక బ్రాండ్**

తెలుగు వారిని ప్రపంచ పటంలో పెట్టింది మన బ్రాండ్ సీబీఎన్. అప్పుడు ఐటీ... ఇప్పుడు ఏఐ. అప్పుడు హైటెక్ సిటీ... ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ. అప్పుడు సైబరాబాద్... ఇప్పుడు అమరావతి. అప్పుడు రూ.200 పెన్షన్ ను రూ. రెండు వేలు చేసింది మన సీబీఎన్... ఇప్పుడు పెన్షన్ ను రూ.నాలుగు వేలు చేసింది కూడా మన సీబీఎన్. అన్న క్యాంటిన్లు, డ్వాక్రా, దీపం, పేదల చిరునవ్వు మన సీబీఎన్. సీబీఎన్ అంటే డెవెలప్మెంట్, సీబీఎన్ అంటే సంక్షేమం, సీబీఎన్ అంటే మానవత్వం. మన నాయకులు ట్రెండ్ ఫాలో అవ్వరు ట్రెండ్ సెట్ చేస్తారు. సినిమా స్క్రీన్ అయినా పొలిటికల్ స్క్రీన్ అయినా ఆయనే లెజెండ్. ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదు ఒక ప్రభంజనం. ఆయనే రాముడు, ఆయనే కృష్ణుడు, ఆయనే భీముడు, ఆయనే అర్జునుడు, ఆయనే కర్ణుడు, ఆయనే ప్రజల గుండెల్లో దేవుడు.

**కూటమి అన్న తర్వాత చిన్న చిన్న సమస్యలు ఉండడం సహజం!**

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నారు. ప్రధాని మోదీ మన రాష్ట్రానికి పూర్తి సహకారం అందిస్తున్నారు. మనం అడిగిన ప్రతి కోరిక తీరుస్తున్నారు. మనకు అహంకారం ఉండకూడదు, అహంకారం విర్రవీగిన గత పాలకుల 151 సీట్లు 11 అయ్యాయి. అందుకే నేల మీద ఉండి ప్రజలకు సేవ చెయ్యాలి. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్టు పనిచేయాలి. చిన్న కుటుంబంలోనే సమస్యలు ఉంటాయి. కూటమి అన్న తరువాత చిన్న చిన్న సమస్యలు ఉండటం సహజం. ఇగోలు పక్కన పెట్టి అందరిని కలుపుకొని పనిచేయాలి. రాసి పెట్టుకోండి విడాకులు ఉండవు. రాష్ట్రం బాగుపడాలి, ప్రజలు సంతోషంగా ఉండాలి అంటే మనం కలిసి ఉండాల్సిందే.. అని నారా లోకేశ్ వివరించారు.

## ఆదివారం నాడూ రేషన్ షాప్స్ ఓపెన్

విజయవాడలో రేషన్ షాపు ద్వారా సరుకుల పంపిణీ ట్రయల్ రన్‌ను నేడు పరిశీలించారు.. పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, . గతంలో రేషన్ వాహనాల కోసం పనులు మానుకుని గంటల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి ఉండేదని, ఆ ఇబ్బందులను తొలగించడమే కాకుండా, లబ్ధిదారులకు మరింత వెసులుబాటు కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. "ప్రజల సౌలభ్యమే మా ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత. జూన్ 1 నుంచి 15 రోజుల పాటు రేషన్ సరుకులు పంపిణీ చేస్తాం. ఈ పదిహేను రోజుల్లో ఆదివారంతో సహా అన్ని రోజులూ షాపులు తెరిచే ఉంటాయి. దీనివల్ల రోజువారీ పనులకు వెళ్లేవారు, కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు తమకు వీలైన సమయంలో, ముఖ్యంగా సెలవు దినమైన ఆదివారం కూడా రేషన్ తీసుకునేందుకు అవకాశం కలుగుతుంది" అని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## రాజారెడ్డికి విజయమ్మ, షర్మిల నివాళులు

నిర్వహించారు.అనంతరం పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో వైయస్ రాజారెడ్డి శతజయంతి కేకును వారు కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ%ౌ% వైఎస్ రాజారెడ్డి అంటే తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారు లేరన్నారు. పులివెందుల ప్రజల కోసం ఆయన ఎప్పుడూ తపించేవారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, పట్టణ అధ్యక్షుడు అనిల్ కుమార్ రెడ్డి, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు తన తాత రాజారెడ్డి ఘాట్ వద్ద నివాళి కార్యక్రమానికి వైసీపీ అధినేత జగన్ దూరంగా ఉన్నారు. ఈరోజు ఆయన తన తాత శతజయంతిని విజయవాడలోని నిర్మల శిశు భవన్ లో తన భార్య భారతితో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారితో పాటు జగన్ మేనత్త విమలారెడ్డి కూడా ఉన్నారు. పిల్లలతో కలిసి వీరు కేక్ కట్ చేశారు.

# వీళ్లు అంతకంటే హానికరం...
# రాష్ట్రం నుంచి తరిమికొడదాం..



(మొదటి పేజీ నుంచి తరువాయి)

నిర్మించుకున్నారని, కొండలు, చెరువులను కూడా కబ్జా చేశారని మండిపడ్డారు. ప్యాలెస్‌ల నుంచి ఎస్టేట్‌ల వరకు అక్రమ సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న వైకాపాకు ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని అన్నారు. పార్టీ ఎలా ఉండాలో, పాలన ఎలా సాగాలో చెప్పడానికి టీడీపీ ఒక కేస్ స్టడీ అయితే, పాలకులు ఎలా ఉండకూడదో, పార్టీ ఎలా నడపకూడదో చెప్పడానికి వైకాపా మరో కేస్ స్టడీ అని ఆయన వ్యాఖ్యానించారు.

**మహానాడుకు అపూర్వ స్పందన**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేవుని గడప అయిన కడపలో జరిగిన తొలి మహానాడుకు అద్భుత స్పందన లభించిందని, ఇది సూపర్ హిట్ అయిందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. గత ఏడాది మే 2న ప్రజాగళం సభలో "కడప రాజకీయం మారుతోంది" అన్న తన మాట అక్షరాలా నిజమైందని గుర్తుచేశారు. ఉమ్మడి కడప జిల్లాలో 10 స్థానాలకుగాను 7 సీట్లు కూటమి గెలుచుకుందని, వచ్చే ఎన్నికల్లో 10కి 10 సీట్లు గెలవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాయలసీమ ప్రజలు ఈ ఎన్నికల్లో 52 స్థానాలకు 45 స్థానాల్లో కూటమిని గెలిపించి అద్భుత తీర్పు ఇచ్చారని, ఇది తమపై మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని విధాలా ధ్వంసమైందని, రూ.10 లక్షల కోట్ల అప్పులు, రూ.1.20 లక్షల కోట్ల బకాయిలు మిగిల్చి రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, క్లైమోర్ మైన్‌లకే భయపడని తాను ఇలాంటి సమస్యలకు భయపడనని, అనుభవంతో, మనోధైర్యంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. ఏడాది కాలంలోనే సుపరిపాలన అంటే ఏంటో చూపిస్తూ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు.

**సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం**

సంపద సృష్టించడం తెలిసిన పార్టీ టీడీపీ అని, సంక్షేమ కార్యక్రమాలకు ఎన్టీఆర్ నాంది పలికారని చంద్రబాబు గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం వివిధ వర్గాలకు రూ.4 వేల నుంచి రూ.15 వేల వరకు పింఛన్లు అందిస్తున్నామని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా 64 లక్షల మందికి ఏటా రూ.33,000 కోట్లు పింఛన్లకే ఖర్చు చేస్తున్నామని తెలిపారు. 16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి తొలి సంతకం హామీని నిలబెట్టుకున్నామన్నారు. 'దీపం-2' కింద ఏటా 3 సిలిండర్లు ఉచితంగా అందిస్తామని, ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. వందల కోట్లతో రోడ్ల మరమ్మతులు చేపట్టామని, 203 అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామని, 21 దేవాలయాల్లో నిత్యాన్నదానం మొదలుపెట్టామని తెలిపారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన 94 కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 73 పథకాలను పునరుద్ధరించామని వివరించారు. తెలుగుదేశం పార్టీ బీసీల పార్టీ అని, వారి అభ్యున్నతికి ఎప్పుడూ పెద్దపీట వేస్తామని చంద్రబాబు అన్నారు. బడ్జెట్‌లో బీసీలకు రూ.47,456 కోట్లు కేటాయించామని, నాయీ బ్రాహ్మణుల వేతనాలు రూ.25 వేలకు పెంచామని, చేనేతలకు జీఎస్టీ రద్దు చేశామని, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్లు, చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10% కేటాయింపు, మత్స్యకారులకు 'మత్స్యకార భరోసా' కింద రూ.20 వేల ఆర్థిక సాయం వంటి పలు కార్యక్రమాలను వివరించారు.

**యువత, రాయలసీమ అభివృద్ధికి పెద్దపీట**

యువత భవిష్యత్తు కోసమే తాను పనిచేస్తున్నానని, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. నూతన పారిశ్రామిక విధానాలతో రాష్ట్రానికి రూ.4.95 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయని, దేశీయ పెట్టుబడుల్లో అగ్రస్థానంలో, వృద్ధిరేటులో రెండో స్థానానికి చేరుకున్నామని అన్నారు. రాయలసీమను రాళ్ల సీమగా కాకుండా రాష్ట్రానికి మణిహారంగా తీర్చిదిద్దుతామని, ఇక్కడ ఫ్యాక్షన్‌కు తావులేకుండా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. జూన్ 12 లోగా కడపలో స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభిస్తామని, రెండు దశల్లో రూ.9,000 కోట్లతో నిర్మించి 6 వేల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. సీమలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని, గాలేరు-నగరి పనులకు రూ.1,000 కోట్లు తక్షణం విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మహానాడులో తీర్మానించిన 6 శాసనాలతో నూతనత్వాన్ని, కొత్త నాయకత్వాన్ని తీసుకొస్తామని, 2029 నాటికి పేదరికం లేని సమాజమే లక్ష్యమని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రస్తుతం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.2 లక్షల 67 వేలు కాగా, వచ్చే 22 ఏళ్లలో దానిని రూ.55 లక్షలకు పెంచే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు.

కార్యక్రమంలో భాగంగా, కోడూరు నుంచి సైకిల్‌పై మహానాడుకు వచ్చిన కార్యకర్తను సీఎం సన్మానించారు. కడప తాగునీటి సమస్య పరిష్కారానికి, బుగ్గవంక చెరువు అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని సభాముఖంగా హామీ ఇచ్చారు.






# చంద్రబాబును యావత్ ప్రపంచం కీర్తిస్తోంది

## మాధవి రెడ్డి

**కడప, మే 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

**తెలుగువాడి ఆత్మగౌరవ అగ్నిజ్వాలను నాటి ఢిల్లీ పాలకులకు తెలియజేయడం కోసం పుట్టిన పార్టీయే తెదేపా అని కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి అన్నారు. బడుగు బలహీన వర్గాల వారి అభ్యున్నతికి, రాజకీయ స్వాతంత్ర్యం కోసమే ఈ పార్టీ పుట్టిందన్నారు. మహానాడులో ఆమె మాట్లాడుతూ.. " 43 ఏళ్ల తెదేపా చరిత్రలో తొలిసారిగా కడపలో మహానాడు నిర్వహించుకుంటున్నాం. ఈ పార్టీకి క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన కార్యకర్తలే వెన్నెముక. రాష్ట్రంలో మొట్టమొదటిసారి వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్‌లు ఇచ్చిన మహానాయకుడు ఎన్టీఆర్ అయితే.. వాటిని రూ. 4 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచిన ఘనత నారా చంద్రబాబునాయుడిది.**



రాయలసీమ కోసం ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టును నిర్మిస్తే.. ఎస్ఆర్‌బీసీ, హెచ్ఎన్ఎస్, సీఎన్ఎస్-ఎస్, కేసీ కెనాల్‌లను అభివృద్ధి చేసిన చంద్రబాబు.. లక్షలాది మంది రాయలసీమ ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. ఎన్టీఆర్ ఆశయాలను, సిద్ధాంతాలను కొనసాగిస్తూనే.. పరిపాలన, సంక్షేమం, అభివృద్ధిలో పలు సంస్కరణలను తీసుకొచ్చారు.

క్రమశిక్షణ, పట్టుదల, అకుంఠిత దీక్ష, నేర్పు, ఓర్పు కలిగిన విజనరీ నాయకుడిగా చంద్రబాబును యావత్ ప్రపంచం కీర్తిస్తోంది. మనకు కేవలం నదులపై ఆనకట్టలు కనిపిస్తే.. చంద్రబాబుకు మాత్రం నదుల అనుసంధానం గుర్తొస్తుంది. దానికి కార్యరూపమే పట్టిసీమ ఎత్తిపోతల పథకం. పోలవరాన్ని పూర్తి చేసి.. కృష్ణా జలాలను బనకచర్ల రిజర్వాయర్ వరకు తీసుకొస్తే.. రాయలసీమ అభివృద్ధిని ఆపే శక్తి ఎవరికీ ఉండదు" అని మాధవి రెడ్డి అన్నారు.

# సీఐఐ భేటీకి సీఎం చంద్రబాబు..

## కడప నుంచి నేరుగా ఢిల్లీకి పయనం

**అమరావతి, మే 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ముఖ్యమంత్రి చంద్రబాబు కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమాన్ని ముగించుకుని, వరుస కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. మూడు రోజుల మహానాడు గురువారం ముగియనుంది. అనంతరం, ఈ రోజు సాయంత్రమే సీఎం చంద్రబాబు కడప నుంచి ప్రత్యేక విమానంలో నేరుగా ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. రేపు ఢిల్లీలోని తాజ్ హోటల్‌లో జరగనున్న కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) వార్షిక సర్వసభ్య సమావేశానికి (ఏజీఎం) చంద్రబాబు హాజరుకానున్నారు. ఈ సమావేశం సాయంత్రం జరగనుంది. రేపు రాత్రి ఆయన ఢిల్లీలోనే బస చేస్తారు.

ఒక్క రోజు ముందే పింఛన్ల పంపిణీ..

శనివారం ఉదయం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి, నేరుగా రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం మండలం సీహెచ్ గునేపల్లి గ్రామానికి వెళ్తారు. ఆ గ్రామంలో నిర్వహించే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తారు. వాస్తవానికి ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేస్తుండగా, ఈసారి జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో, ఒక రోజు ముందుగానే అంటే మే 31వ తేదీనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

గ్రామస్తులతో ముఖాముఖి..

పింఛన్ల పంపిణీ అనంతరం, సీఎం చంద్రబాబు స్థానిక గ్రామస్తులతో ముఖాముఖి సమావేశం కానున్నారు. ఆ తర్వాత, పార్టీ శ్రేణులతో భేటీ అవుతారు. కార్యక్రమాలన్నీ ముగించుకుని, శనివారం సాయంత్రం ముమ్మిడివరం నుంచి విజయవాడకు తిరుగుపయనమవుతారు. సీఎం పర్యటనకు సంబంధించి జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# గ్రేడ్ 2 మున్సిపాలిటీలుగా గిద్దలూరు, ఎర్రగుంట్ల

**అమరావతి, మే 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్రంలో పలు నగర పంచాయతీలు, మున్సిపాలిటీల స్థాయిని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగర పంచాయతీలుగా ఉన్న గిద్దలూరు, ఎర్రగుంట్లను గ్రేడ్ 2 మున్సిపాలిటీలుగా.. నరసరావుపేట, ఎమ్మిగనూరు మున్సిపాలిటీలను గ్రేడ్ 1 మున్సిపాలిటీలుగా స్థాయి పెంచుతూ ఆదేశాలు జారీ అయ్యాయి. తక్షణమే ఈ మార్పులు అమల్లోకి వస్తాయని పేర్కొంటూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ నోటిఫికేషన్లను జారీ చేశారు.








తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
శుక్రవారం 30 మే 2025

## ముందుగానే లబ్ధిదారుల చెంతకు పెన్షన్ల పంపిణీ -ఎంపిడిఒ చెరుకూరి శ్రీనివాస్



**పోలవరం, మే29(తెలుగు రాష్ట్రం విలేకరి):** పోలవరం మండలంలో జూన్ నెల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లనుఒకరోజు ముందుగానే లబ్బిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ చెరుకూరి శ్రీనివాస్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ 1 వ తేదీ ఆదివారం రావడంతో మే 31తేదీ ఉదయం 6 గంటల నుండి పింఛను లబ్దిదారుల ఇళ్ళవద్దనే పెన్షన్లు ఇవ్వడం జరుగుతుందని లబ్దిదారులు ఇళ్ళవద్దనే ఉండాలని పెన్షన్ సొమ్ముల కోసం ఎక్కడికీ వెళ్ళనవసరం లేదని సూచించారు.

## పనామా, భారతదేశాల మధ్య బంధం మరింత బలోపేతం -ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం, మే 29(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** పనామా, భారతదేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి అన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని వారి దుశ్చర్యలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు డాక్టర్ శశి థరూర్ నేతృత్వంలోని అఖిల పక్ష పార్లమెంటరీ బృందం పనామా దేశం చేరుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పనామా దేశ అధ్యక్షుడు జోస్ రౌలి ములినోతో అఖిల పక్ష బృందం సమావేశమైనట్లు బృంద సభ్యులు హరీష్ తెలిపారు. ఈ సమావేశంలో ఇటీవల పాకిస్తాన్ ఉగ్రవాదులు పహల్గాంలో జరిపిన మారణకాండ గూర్చి, ఆపరేషన్ సింధూర్ గూర్చి ములినోకు వివరించినట్లు చెప్పారు. ఉగ్రవాదంపై భారతదేశం తీసుకున్న స్పష్టమైన, నైతికమైన నిర్ణయానికి పనామా దేశ ప్రభుత్వం స్పందన ప్రశంసనీయమైనదని తెలిపారు. ఉగ్రవాదాన్ని ఖండిస్తూ దేశ, ప్రపంచ దేశాల భద్రత కోసం భారతదేశం తీసుకుంటున్న చర్యలకు అధ్యక్షుడు ములినో సంపూర్ణ మద్దతు వెల్లడించారని తెలిపారు. భారత-పనామా దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కూడా ఈ సమావేశం జరిగిందని ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు.

## ఘనంగా రుద్ర హోమం



**ఐ పోలవరం మే29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** వైశాఖ మాసం ఆరుద్ర నక్షత్రం మహపర్వదినం పురస్కరించుకుని మురమళ్ళ శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయం లో గురువారం రుద్రహోమం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత గణపతి పూజ, మండపారాదన అనంతరం రుద్ర హోమం పూర్ణాహుతి కార్యక్రమం జరిపారు. ప్రతి నెల ఆరుద్ర నక్షత్రం రోజున రుద్ర హోమం కార్యక్రమాలు భక్తుల గోత్రనామాలతో దేవస్థానం తరపున నిర్వహిస్తారు 17 రుద్ర హోమం లో పాల్గొన్నారు. కార్యానిర్వాహణాధికారి మాట్లాడుతూ నిత్య, మాస, వార్షిక పూజలు, ఈ హుండీ, డోనేషన్, ఈ విరాళాలు దేవాదాయశాఖ వెబ్సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఏర్పాట్లు సహాయ కమీషనర్ కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

## బాధిత కుటుంబానీ పరామర్శ



**ఐ పోలవరం మే 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిది గోదావరి లో స్నానానికి దిగి గల్లంతై మృతి చెందిన వారిలో ఐ.పోలవరం మండలం ఎర్రగరువు గ్రామం నకు చెందిన వడ్డి మహేష్, వడ్డి రాజేష్ కుటుంబాన్ని ఐ పోలవరం మండల అధ్యక్షురాలు మోర్త రాణి మిరియం జ్యోతి, ఐ పోలవరం జెడ్పీటీసీ సభ్యులు ముదునూరి సతీష్ రాజు పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఒకే కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు మరణించటం చాలా దురదృష్టకారమని,కుటుంబానికి తిరనిలోటు అని అన్నారు.

# ఘనంగా అహల్యాబాయ్ హోల్కర్ జయంతి వేడుకలు.



**ఆత్రేయపురం, మే 29(తెలుగు రాష్ట్రం విలేకరి)** ఒక పురుషాధిక్య సమాజంలో అహల్యాబాయ్ హోల్కర్ అనే మహిళ తన ఆత్మస్థైర్యంతో, సేవా భావంతో, విశ్వాసంతో ప్రజల గుండెల్లో చోటు సంపాదించిన ధీరవనిత. ఇండోర్ సంస్థాన రాణిగా 1767 నుంచి 1795 వరకు పాలించి, న్యాయ పరిపాలనలోనూ, మతరాజకీయాల్లోనూ మానవతా విలువలను ప్రతిష్టించిన ఆమె 300వ జయంతి సందర్భంగా ఆత్రేయపురం మండలంలో నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బీజేపీ మండల శాఖ ఆధ్వర్యం వహించగా, మండల అధ్యక్షుడు యు. వెంకటేశ్వరరావు అధ్యక్షతన, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శిష్ట కుటుంబరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మహిళా మోర్చా సెక్రటరీ ఆకుమర్తి బేబీరాణి, నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి కాలాబత్తుల చిన్నారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు మాట్లాడుతూచరిత్రలో అహల్యాబాయి హోల్కర్ ది మహోన్నతమైన స్థానమనిఅహల్యాబాయ్ పూర్వీకులు మాల్వా ప్రాంతానికి చెందినవారు. ఆమె భర్త మాల్హారావ్ హోల్కర్ మరణం అనంతరం రాణిగా బాధ్యతలు చేపట్టి, 18వ శతాబ్దంలో అశాంతికర భారత రాజకీయ వాతావరణంలోనూ అత్యద్భుతంగా పరిపాలించారు. అహల్యాబాయ్ పాలనలో ప్రజల శ్రేయస్సు కోసం పన్నులను తగ్గించారు. తాగునీటి కుళాయిలు, బావుల నిర్మాణాలకు పెద్దపీట వేశారు. విద్యా సంస్థలు, వసతి గృహాలు, అన్నదాన కేంద్రాలను స్థాపించారు. ముఖ్యంగా కాశీ విశ్వనాథ్, సోమనాథ్, ద్వారకా, రామేశ్వరం, గృశ్నేశ్వర్ వంటి అనేక పవిత్ర హిందూ క్షేత్రాలను పునర్నిర్మించారు. ఆమె పాలనలో ధర్మం, దయ, న్యాయం ప్రధాన స్తంభాలుగా నిలిచాయి. మతపరమైన సహనంతో, సామాజిక సమానత్వానికి ఆమె గొప్ప ఉదాహరణ అని బేబీరాణి చెప్పారు. ఆమె కాలంలో మహిళలకు విద్యా అవకాశాలు లేకపోయినా, ఆమె స్వయంగా చదివి పాలనలోకి రావడం, స్వచ్ఛంగా కుటుంబ విలువలు పాటిస్తూ రాజ్యాన్ని నడపడం, నేటి యువతికి గొప్ప స్ఫూర్తిగా నిలుస్తోంది అని ఆమె తెలిపారు. “అహల్యాబాయ్ బలమైన నాయకత్వానికి, సేవా శీలతకు సజీవ ఉదాహరణ. మహిళలు ఆమెను ఆదర్శంగా తీసుకుని ప్రతి రంగంలో అభివృద్ధి చెందాలి.” అన్నారు. వేడుకల సందర్భంగా సమాజానికి సందేశం ఈ కార్యక్రమం ద్వారా యువతలో చరిత్ర పట్ల గౌరవం, మహిళా చైతన్యం పట్ల అవగాహన పెంపొందించాలన్నదే ప్రధాన ఉద్దేశమని శిష్ట కుటుంబరావు అన్నారు. చిన్నారి మాట్లాడుతూ, “అహల్యాబాయ్ జీవితం మనందరికీ బోధన. నాయకత్వం అనేది సేవతో ప్రారంభమవుతుందని ఆమె చూపించారు. మన గ్రామీణ యువత ఆమె లాంటి మార్గదర్శకులను అనుసరిస్తే సమాజం ఎదుగుతుంది.” అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి కాలభత్తులు చిన్నారి, కిసాన్ మోర్చా నాయకులు రమేష్ వర్మ, ఒబిసి మోర్చ నాయకులు గూడవెల్లి రాంబాబు, మహిళా మోర్చా జోనల్ ఇంచార్జ నందం లక్ష్మి, బిజెపి మండల కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామపెద్దలు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## నిబంధనలకు అనుగుణంగా రేషన్ సరుకులు పంపిణీ చేయాలి

### - రేషన్ డీలర్లకు డి.ఎస్.ఓ ఉదయ భాస్కర్ ఆదేశాలు




**అమలాపురం, మే 29,(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జూన్ 1వ తేదీ నుంచి నిబంధనలకు అనుగుణంగా రేషన్ సరుకులను వినియోగదారులకు సరఫరా చేయాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఏ.ఉదయ భాస్కర్ రేషన్ షాపు డీలర్లకు గురువారం ఒక ప్రకటన ద్వారా సూచించారు. జూన్ 1వ తేదీ నుంచి చౌక ధరల దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ పునః ప్రారంభం కాబోతుందని, ప్రతి నెలా 1వ తేదీ నుంచి15వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు దుకాణాలను తెరిచి ఉంచాలని రేషన్ డీలర్లను ఆదేశించారు. దుకాణాల పని వేళలు, ధరలు, సరుకు నిల్వను సూచించే బోర్డును షాప్ ముందు భాగంలో తప్పని సరిగా ప్రదర్శించాలన్నారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలన్నారు. చౌక ధరల దుకాణాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ పాస్, వేయింగ్ మిషన్లు కండిషన్లో ఉంచుకుని కార్డుదారులందరికీ కచ్చితమైన తూకంతో వస్తువులను పంపిణీ చేసి రశీదును కూడా ఇవ్వా లని సూచించారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులను ఆన్లైన్ ద్వారా చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని డిఎస్ఓ ఉదయభాస్కర్ తెలిపారు. కొత్త కార్డు, కార్డు విభజన, సాధారణ విభజన, వితంతు విభజన, విడాకుల విభజన, సభ్యుల చేరిక, సభ్యుల తొలగింపు, తప్పు ఆధార్ సీడింగ్ దిద్దుబాటు, చిరునామా మార్పు, కార్డు సరెండర్ తదితర మార్పులు, చేర్పుల కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు. ఈ సేవలు అందించేందుకు ఎటువంటి కాలపరిమితి విధించలేదని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని డీఎస్ఓ తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలో అర్హత కలిగిన లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలు అధికారులతో ప్రాజెక్టు అధికారి సమావేశం



**రంపచోడవరం, మే 29 (తెలుగురాష్ట్రం విలేకరి):** రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు వివిధ తరగతులకు సంబంధించిన అడ్మిషన్లు తీసుకొనుటకు వచ్చే విద్యా సంవత్సరానికి సిద్ధం చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్ట సింహాచలం ఆదేశించారు. గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్లతో జూన్ నెల 12వ తారీకు నుండి ప్రారంభం కానున్న పాఠశాలలు ఎక్కడికక్కడ సిద్ధం చేసే విధంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. రుక్మాండయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ జూన్ 12వ తారీకు నుండి అన్ని పాఠశాలలు ప్రారంభం నాటికి అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు శుభ్రం చేయాలని అన్నారు. పాఠశాలలో ఏమైనా రిపేర్లు ఉన్న ఎడల వెంటనే రిపేర్లు చేయించాలని ఆయన అన్నారు. ఆశ్రమ పాఠశాలలకు సంబంధించిన వాటర్ ట్యాంకులు క్లీన్ చేయించాలని ఆయన అన్నారు. ప్రతి ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ పాఠశాలలు క్లోరిన్ చేయించాలని ఆయన అన్నారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు ఎఫ్ ఆర్ ఎస్ నూటికి నూరు శాతం హాజరు వేయించాలని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థికి బ్యాంక్ అకౌంటు వివరాలు సేకరించాలని ఆయన అన్నారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన రిజిస్టర్లు పక్కాగా నిర్వహించాలని ఆయన అన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు పూర్తి బాధ్యతలు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నూటికి నూరు శాతం అన్ని సీట్లుకు అడ్మిషన్లు తీసుకోవాలని ఆయన అన్నారు. సమస్యలు ఏమైనా ఉన్నాయెడల మా దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. ఆగస్టు నాటికి ప్రతి ఆశ్రమ పాఠశాలలలో నెట్వర్క్ సమస్య పరిష్కరించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సహాయక గిరిజన సంవత్సరం శాఖ అధికారులు రామ తులసి, కృష్ణమోహన్, జల్లి శంభుడు, డిప్యూటీ డైరెక్టర్ వారి కార్యాలయ సూపరిండెంట్ బి. కిషోర్, అన్ని ఆసరా పాఠశాలకు సంబంధించిన స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కళాకారుల ద్వారా ఎయిడ్స్ పట్ల అవగాహన



**కాట్రేనికోన, మే 29(తెలుగు రాష్ట్రం విలేఖరి):** ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆదేశాల మేరకు కొత్తపేట ఐసీటీసీ సెంటర్, జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ అమలాపురం సెంటర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో రాంబాబు జానపద కళాకారుల చేత వీధి నాటక ప్రదర్శన కార్యక్రమం ద్వారా హెచ్ఐవి కేవలం 4 మార్గాల ద్వారా మాత్రమే వస్తుందని తెలిపారు. సురక్షితం కానీ లైంగిక సంబంధాల ద్వారా కలుషిత సూదులు మరియు సిరంజిల ద్వారా హెచ్ఐవి సోకిన తల్లి నుండి బిడ్డకు సోకుతుంది కలుషిత రక్త మార్పిడి, హెచ్ ఐ వి పరీక్ష చెయ్యనటువంటి రక్తాన్ని ఎక్కించు కోవటం ద్వారా అలాగే హెచ్ఐవి ఉన్న గర్భిణీ స్త్రీల నుండి పుట్టబోయే బిడ్డకు హెచ్ఐవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కళాకారులు చాలా చక్కగా జానపద పాటల చేత వివరించారు. అలాగే హెచ్ఐవి యాక్టు 2017 హెచ్ఐవి చట్టం గురించి వివరించారు. హెచ్ఐవి గురించి ఎలాంటి సందేహం ఉన్న 1097 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి వివరాలను అడగొచ్చని జానపద కళాకారులు వివరించారు. ఈ కార్యక్రమానికి కొత్తపేట ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ ఎం.దుర్గాప్రసాద్, జనకళ్యాణ్ ప్రాజెక్ట్ మేనేజర్ జి. శ్రీన, కాట్రేనికోన పి.హెచ్.సి. పి.హెచ్.ఎన్ జి.రామశేషులు, హెచ్.వి. జె.రమణయమ్మ, సచివాలయం ఎ.ఎన్.ఎం. కె.పి.ఎన్.కె.పావని, ఎన్..ఆర్.జి.ఎస్.ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్.తాతాజీ, జనకళ్యాణ్ టి ఐ ప్రాజెక్ట్ సిబ్బంది లోకేష్, వెంకటేష్, ఆశావర్కర్స్ కె.సింహాచలం, ఎం.దుర్గమ్మ, కాట్రేనికోన ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పి హెచ్ సి సిబ్బంది, ఏ ఎన్ ఏం లు ఆశ వర్కర్స్ కళాకారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## బొబ్బర్లంక - లొల్ల ఆర్ అండ్ బి రోడ్డు మూసివేత

### - బొబ్బర్లంక నుంచి వేమగిరి మీదుగా ట్రాఫిక్ మళ్లింపు



**ఆత్రేయపురం, మే 29, (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామ సమీపంలో సైఫాన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆర్ అండ్ బి రోడ్డును తొలగించి పైప్ లైన్ నిర్మాణ పనులు చేపట్టిన నేపథ్యంలో బొబ్బర్లంక - ఊబలంక రోడ్డును లొల్ల వరకు అధికారులు తాత్కాలికంగా మూసివేసారు. దీంతో వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి బొబ్బర్లంక మీదుగా వచ్చే భక్తుల వాహనాలను ధవళేశ్వరం, వేమగిరి మీదుగా రావులపాలెం వైపు మళ్లించారు. కొవ్వూరు, నిడదవోలు, రాజమహేంద్రవరం నుంచి వాడపల్లి ఆలయానికి వచ్చే భక్తులు ట్రాఫిక్ మళ్లింపు నేపథ్యంలో ధవళేశ్వరం , వేమగిరి వయా రావులపాలెం మీదుగా వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి రావాలని ఆత్రేయపురం ఎస్సై ఎం.రాము సూచించారు.

# ఉపాధి లేక విలవిలలాడుతున్న నిరుద్యోగ యువత

## -సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు



**రాజమండ్రి, మే 29(తెలుగురాష్ట్రం ప్రతినిధి) :** దేశంలో రోజురోజుకి నిరుద్యోగం పెరిగి పనులు లేక దేశ యువత మానసిక ఆందోళనకు గురవుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు విమర్శించారు. గురువారం స్థానిక అపరాల సెక్షన్ సిపిఐ శాఖ బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ బహిరంగ సభకు సిపిఐ శాఖ కార్యదర్శి జి హరినాథ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ప్రతి ఏడాది డిగ్రీలు బీటెక్లు పూర్తి చేసుకుని నిరుద్యోగ యువత ఉద్యోగాలు లేక, ఉపాధి లేక, పని చేస్తామంటే పనులు లేక కొన్ని రాష్ట్రాల్లో అర్ధాకలతో అలమటిస్తున్నారని మధు ఆరోపించారు. నిరుద్యోగ భృతి కల్పిస్తామని చెప్పిన ఏపీ ప్రభుత్వం ఇప్పటికీ ఎన్నికల హామీలను అమలు చేయలేదని యువతరం మోసం చేస్తుందని ఆయన విమర్శించారు. గుంటూరు జిల్లా తెనాలిలో ముగ్గురు యువకులను అత్యంత ఖరాంతకంగా నడిరోడ్డు మీద కూర్చోబెట్టి కాళ్లపై విచక్షణ రహితంగా కొట్టిన పోలీసులను సస్పెండ్ చేయాలని ఆయన కోరారు. అంతేకాకుండా ఆ పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం శిక్షించాలని మధు కోరారు. ఈ సమావేశములో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె. రాంబాబు, నగర కార్యదర్శి వి. కొండలరావు, సహాయ కార్యదర్శి సప్పు రమణ, టౌన్ కార్యవర్గ సభ్యులు పి. లావణ్య, టీ. నాగేశ్వరరావు, నల్ల రామారావు, టీ. త్రిమూర్తులు, జట్ల సంఘం అధికార బాడి అప్పల నాయుడు, అపరాల సెక్షన్ కార్యదర్శి కె. వేణు తదితరులు పాల్గొన్నారు

# ఆర్డర్ ఇచ్చిన 15 నిమిషాల్లోనే వస్తువు డెలివరీ

## - బ్లింక్ ఇట్ సూపర్ మార్కెట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు



**భీమవరం మే 29, (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :** ఆర్డర్ ఇచ్చిన 15 నిమిషాల్లోనే వస్తువు డెలివరీ చేయడం బ్లింక్ ఇట్ ప్రత్యేకత అని, ఇటువంటి సూపర్ మార్కెట్ మన భీమవరం పట్టణంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం పద్మాలయ థియేటర్ రోడ్డులోని కోదండ రామాలయం వద్ద బ్లింక్ ఇట్ సూపర్ మార్కెట్ ను గురువారం ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. భీమవరం నియోజకవర్గానికి కార్పొరేట్ సంస్థలు తరలివస్తున్నాయని, అభివృద్ధిలో భీమవరం శరవేగంగా ముందుకు సాగుతోందని అన్నారు. స్టోర్ నిర్వాహకులు గొట్టుముక్కల బలరామకృష్ణంరాజు, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ 26 స్టోర్స్ ఉన్నాయని, భీమవరంలో మొదటి స్టోర్ అని అన్నారు. అన్ని రకాల వస్తువులను ఒకే చోట లభిస్తాయని, ఆర్డర్ ఇచ్చిన 15 నిమిషాల్లోనే డోర్ డెలివరీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జయసూర్య, మున్సిపల్ కమిషనర్ కె రామచంద్ర రెడ్డి, పళ్ళ ఏసుబాబు, పొత్తూరి బాపిరాజు, సిఐ కాళీ చరణ్, కూనపరాజు బలరామరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రక్తపు బొట్టు విలువైనదే

## - రాయలంలో జనసేన పార్టీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు

**భీమవరం మే 29, (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :**



రక్తదానం చేయడం ద్వారా దాతల ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందని, యువతలో మానవతా విలువలు పెరుగుతాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం మండలం రాయలంలోని జనసేన పార్టీ అధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ఎమ్మెల్యే అంజిబాబు పుట్టినరోజును పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని తద్వారా ప్రాణదాతలు కావాలని అన్నారు. రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) మాట్లాడుతూ ప్రతిరోజూ రక్తం అవసరం ఉండి ఎంతోమంది ఇబ్బందులకు గురౌతున్నారని, ప్రమాదాల్లో గాయపడిన వారు రక్తం కోసం పాట్లు పడుతున్నారని, రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. ప్రతి రక్తపు బొట్టు విలువైనదని, రక్త దానంపై అపోహలు వీడాలన్నారు. అనంతరం 125 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారని, రక్తదానం చేసిన సర్టిఫికెట్స్ అందిస్తున్నామని పత్తి హరివర్ధన్, యర్రంశెట్టి శివకృష్ణ, రామభద్రిరాజు తెలిపారు. కార్యక్రమంలో రాయలం జనసేన పార్టీ నాయకులు, గ్రామస్తులు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు పాల్గొన్నారు.

# సౌమ్యుడు .. శాంతిపరుడు .. నిశ్వర్ధపరుడు ఎమ్మెల్యే అంజిబాబు

## -ఒక రోజు ముందుగానే ఎమ్మెల్యే అంజిబాబు పుట్టినరోజు వేడుకలు-

## ఎమ్మెల్యే అంజిబాబుకు శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా కలెక్టర్ నాగరాణి





**భీమవరం మే 29, (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :** సౌమ్యుడు .. శాంతిపరుడు .. నిశ్వర్ధపరుడు భీమవరంఎమ్మెల్యే అంజిబాబు అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం మండలం రాయలంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో రాయలం జనసేన పార్టీ అధ్వర్యంలో రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పుట్టినరోజు వేడుకలను గురువారం ఒకరోజు ముందుగానే నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు కేక్ కట్ చేశారు. జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే వ్యక్తి ఎమ్మెల్యే అంజిబాబు అని, ఆయన మరెన్నో పదవులు అధిరోహించాలన్నారు. జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆయన పుట్టినరోజు ఒక పండుగ వాతావరణంలో వేడుకలను నిర్వహిస్తున్నామని, అభిమానులు కార్యకర్తలు నాయకులకు ఇది ఒక పండుగ రోజు అని అన్నారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ నాపై మీరు చూపిస్తున్నా ఆదరణ అభిమానులను ఎప్పటికీ మరవలేనని అన్నారు. కార్యక్రమంలో రాయలం జనసేన పార్టీ నాయకులు, గ్రామస్తులు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు పాల్గొన్నారు.

# ఆంధ్రా శబరిమలై లో అయ్యప్ప స్వామికి 18 మెట్లకు మామిడిపండ్లతో నివేదన.

## -మహా కుంభాభిషేకం, కోటి బిల్వార్చన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన శ్రీనివాసరావు గురుస్వామి.



**శంఖవరం,మే 29, (తెలుగురాష్ట్రం విలేకరి):** శంఖవరం మండలం సిద్ది పుణ్యక్షేత్రంలో గల ఆంధ్రా శబరిమలై లో కొలువైన అయ్యప్ప స్వామి సన్నిధిలో గల 18 మెట్లను మామిడిపండ్లతో నింపి స్వామికి ఆలయ చైర్మన్ కుసుమంచి శ్రీనివాసరావు గురుస్వామి నివేదన సమర్పించారు. శ్రీనివాసరావు గురుస్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు నిర్వహించి హారతులు అందించారు. అనంతరం భక్తులకు మామిడి పండ్లను ప్రసాదం అందించారు. ఈ సంవత్సరం అక్టోబర్ నెలలో ఆంధ్రా శబరిమలైలో నిర్వహించే మహా కుంభాభిషేకం, కోటి బిల్వార్చన పూజ కరపత్రాన్ని స్వామి సన్నిధిలో భక్తుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు గురుస్వామి మాట్లాడుతూ అక్టోబర్ లో ఆలయం వద్ద నిర్వహించే కార్యక్రమాలపై భక్తులతో, గురుస్వాములతో తొలి సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. అక్టోబర్ 9,10,11 తేదీల్లో ఆలయం వద్ద హెూమాలు, క్రతువులు, విశేష పూజలు నిర్వహిస్తామని, 11 వ తేదీన స్వామివారికి,4 ఆలయ శిఖరాలకు మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 30 వ తేదీ నుండి నవంబర్ 18 వ తేదీ వరకు ఏకధాటిగా మహా కోటి బిల్వార్చన పూజా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. స్వామి సన్నిధిలో నిర్వహించే ఈ బృహత్తర కార్యక్రమాలకు స్వాములు, భక్తులు తరలిరావాలని కోరారు. ఇక్కడకు వచ్చే భక్తులకు ప్రసాదాలతో పాటు, అన్న ప్రసాదం అందించడం జరుగుతుందని శ్రీనివాసరావు గురుస్వామి తెలిపారు.


# 13ఏళ్లకే ఆంగ్ల ఫిక్షన్ నవల అల్లిన మహీరమ

## -నవల పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ ప్రసన్నశ్రీ-చల్లా మహీరమకు వీసీ ప్రశంసలు



**రాజమండ్రి, మే 29(తెలుగురాష్ట్రం ప్రతినిధి) :** రాజమహేంద్రవరం నగరానికి చెందిన 13 సంవత్సరాల చల్లా మహీరమ ప్రకృతి, పంచభూతాల కథాంశంగా చిన్నారులు పాత్రధారులుగా ఆంగ్లంలో "రూబీస్ బ్లూస్టీమ్ అండ్ ది బాండ్ ఆఫ్ ఫైర్" పేరుతో ఆసక్తికర కథనంతో ఫిక్షన్ నవలను వ్రాసి రికార్డు సృష్టించిందని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. గురువారం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో మహీరమ వ్రాసిన పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించి 13 సంవత్సరాలకే ఆంగ్ల నవల పుస్తకాన్ని రాసిన చల్లా మహీరమ ను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు చల్లా వెంకట సుబ్బరాయశాస్త్రి (సివిఎస్ శాస్త్రి) మనవరాలైన మహీరమ 13ఏళ్లకే ఇంగ్లీషు భాషలో "రూబీస్ బ్లూస్టీమ్ అండ్ ది బాండ్ ఆఫ్ ఫైర్" పేరుతో ఆసక్తికర కథనంతో ఫిక్షన్ నవలను రాసారని ప్రశంసించారు. సివిఎస్ శాస్త్రి కుమారుడు రోషన్ కృష్ణ, వెంకట సాయిసుధ దంపతుల కుమార్తె అయిన మహీరమ 6వ ఏట వరకు అమెరికాలో పెరిగిందని, ప్రస్తుతం తండ్రి ఉద్యోగ రిత్యా హైదరాబాద్ లో 9వ తరగతి చదువుతోందని తెలిపారు. నేటి రోజుల్లో తోటి వయస్సు పిల్లలంతా సెల్ ఫోన్ల మాయలో పడితే మహీరమ మాత్రం 8వ ఏట నుంచే రచనా వ్యాసంగాన్ని చేపట్టడం విశేషమన్నారు. నవలా రచనలో తనదైన శైలిని, సొంత పదసంపదను సృష్టించడం మహీరమ ప్రత్యేకత అని తెలిపారు. అలాగే కర్ణాటక గాత్ర సంగీతంలో 4వ గ్రేడ్ శిక్షణ పొందుతోందని, కీబోర్డు, చిత్రలేఖనం, సొంతంగా పాటలు రాస్తూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఎదగడం అరుదైన రికార్డు అని అన్నారు. భాష, సంస్కృతి, సంగీతం, సాహిత్యాలలో తనను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను, బంధువులను అభినందించారు. నేటి తరం యువత చల్లా మహీరమ ను స్ఫూర్తిగా తీసుకొని మంచి లక్షణాలతో ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. రచయిత్రి చల్లా మహీరమ మాట్లాడుతూ ప్రకృతితో మానవుడి అనుబంధం, ప్రకృతికి విరుద్ధంగా ప్రవర్తిస్తే ఏర్పడే పర్యావసనాలు, జీవిత గమ్యాన్ని ఈ రచనల ద్వారా చెప్పడం జరిగిందన్నారు. ప్రకృతి అంటే తనకు ఎంతో ఇష్టమని, అందుకే తాను అనుభూతి చెంది నవలలు రాస్తున్నానని తెలిపారు. లండన్ లో ఉంటున్న గంధం పావన ఈ నవలకు ఆకట్టుకునేలా కవర్ పేజీని రూపొందించాని తెలిపారు. 19 గిరిజన భాషలకు లిపిని రూపొందించిన వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ చేతుల మీదుగా తన పుస్తకాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. తనను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, తాత మామలకు, గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహీరమ తల్లి చల్లా సాయి సుధా, అమ్మమ్మ తాతయ్యలు గోపాలమ్మ, ఎ.వి.ఎస్.రాజు, స్పృహా అలూమ్ని అసోసియేషన్ ప్రెసిడెంట్ సుంకర నాగేంద్ర కిషోర్ మరియు విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఫోటో- వీడియో గ్రాఫర్ల ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి- లంకిశెట్టి బాలాజీ



**మచిలీపట్నం,మే 29, (తెలుగురాష్ట్రం విలేకరి):** ఎంతోకాలంగా పెండింగ్లో ఉన్న రాష్ట్ర ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల సంక్షేమం కోసం రాష్ట్రస్థాయి ఫెడరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఫోటోగ్రాఫర్ల సంఘం లీగల్ అడ్వైజర్ లంకిశెట్టి బాలాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీ.ఎం కె. పవన్ కళ్యాణ్ ను కోరారు. గురువారం మచిలీపట్నం లో జరిగిన ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల మచిలీపట్నం డివిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం కు లంకిశెట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్లు నూతన టెక్నాలజీని అలవర్చుకోవాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పోలింగ్ సమయంలో కౌంటింగ్ సమయంలో ఫోటోగ్రాఫర్లకు విడియో గ్రాఫర్లకు ప్రభుత్వ పరంగా పని కేటాయించాలని బాలాజీ కోరారు. దక్షిణ భారతదేశంలో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్ రే విగ్రహాన్ని ఏర్పాటు చేసిన మచిలీపట్నం ఫోటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వ పరంగా ఫోటోగ్రాఫర్లకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని అర్హులైన వృద్ధ ఫోటోగ్రాఫర్లకు పెన్షన్లు మంజూరు చేయాలని బాలాజీ కోరారు.విజయవాడ సోనీ కెమెరా డిస్ట్రిబ్యూటర్ సాయి రెడ్డి మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్ల కోసం తమ సంస్థ తక్కువ ధరలకు రా మెటీరియల్ అందిస్తుందని తెలియజేశారు. మచిలీపట్నం డివిజన్ ఫోటోగ్రాఫర్లు మరియు విడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలంకుర్తి శేషు మాట్లాడుతూ మచిలీపట్నంలో జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్లు కోసం సంఘ భవనానికి ఐదు సెంట్లు స్థలం కేటాయించాలని కోరారు. హైదరాబాద్ నుంచి వచ్చిన మెంటార్ అబ్దుల్ ఫరూక్ కెమెరా లోని మెలకువలను తెలియజేశారు. తొలుత కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి లంకిశెట్టి బాలాజీ పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సమావేశానికి మచిలీపట్నం పెడన చిన్నాపురం ఇతర ప్రాంతాల నుంచి ఫోటోగ్రాఫర్లు వీడియోగ్రాఫర్లు హాజరయ్యారు.

# విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

## - సబ్ జైలు సూపరింటెండెంట్ పి రమేష్





**మచిలీపట్నం,మే 29, (తెలుగురాష్ట్రం విలేకరి):** విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పెరిగి, సవాళ్లను ఎదుర్కొని విజయవంతంగా ముందుకు సాగినప్పుడే వారి భవిష్యత్తు బాగుంటుందని మచిలీపట్నం సబ్ జై సూపర్ అంటే పి రమేష్ అన్నారు. స్థానిక 45వ డివిజన్ ఈడేపల్లి శాఖా గ్రంథాలయంలో గ్రంధాలయ నిర్వాహకురాలు కోన వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల కార్యక్రమానికి గురువారం సబ్ జైల్ సూపరింటెండెంట్ పి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వేసవి సెలవుల శిక్షణ ద్వారా విద్యార్థినీ విద్యార్థులకు జ్ఞాన వృద్ధి తో పాటుగా పిల్లలు కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం కలుగుతుందన్నారు.ఈ వేసవి శిక్షణా తరగతుల ద్వారా పిల్లలు స్నేహితులతో మమేకమై, కొత్త స్నేహితులను ఏర్పరచుకుని పిల్లలు సామాజిక నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవచ్చు అన్నారు. పిల్లలలో ఆత్మవిశ్వాసం పెరిగి, సవాళ్లను ఎదుర్కొని విజయవంతంగా ముందుకు సాగినప్పుడే వారి భవిష్యత్తు బాగుంటుంది అన్నారుఈ సమ్మర్ క్యాంపులో నేర్పించే చిత్రలేఖనం, హ్యాండ్ రైటింగ్, శ్లోకాలు జనరల్ నాలెడ్జ్, కరాటే, బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, కూచిపూడి నృత్యం వంటి కార్యాచరణల ద్వారా సృజనాత్మకత ప్రోత్సహించబడుతుందని అన్నారు.వేసవి శిక్షణ తరగతుల ద్వారా 45వ డివిజన్ నందు గల ఈడేపల్లి శాఖ గ్రంధాలయం లో పిల్లల అభివృద్ధికి సహాయపడే మంచి అవకాశాలు ఇస్తున్నందున నిర్వాహకురాలు కోన వెంకటేశ్వరమ్మ ను మచిలీపట్నం సబ్ జైల్ సూపరింటెండెంట్ అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో 45 డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్, ఈడేపల్లి శాఖ గ్రంథాలయ నిర్వాహకురాలు కోన వెంకటేశ్వరమ్మ లతోపాటుగా ఉపాధ్యాయులు శేషగిరిరావు, కాగిత సాంబశివరావు, లాల్ బహదూర్ శాస్త్రి, కేశవ, తూము రవీంద్ర లు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# పోటెత్తిన అభిమానం..

## జనసంద్రమైన మహానాడు ప్రాంగణం













కడప, మే 29 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మహానాడు బహిరంగ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి తెలుగు తమ్ముళ్లు కదం తొక్కారు. ఆశించిన మేర కన్నా అధిక సంఖ్యలో తరలిరావడంతో కడప పరిసరాలు జనసంద్రంగా మారాయి. తెలుగుదేశం జెండా వాహనాలతో రహదారులు కిటకిటలాడుతున్నాయి. మహానాడుకు సమీప గ్రామాల ప్రజలు ద్విచక్రవాహనాలు, కాలినడకన చేరుకున్నారు. అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో సభా ప్రాంగణానికి మూడు కిలోమీటర్ల దూరంలోనే వాహనాలను నిలిపివేశారు.

### భారీగా భోజన ఏర్పాట్లు..

మహానాడు ప్రాంగణంలో 3 లక్షల మందికి సరిపడా భోజన ఏర్పాట్లు చేశారు. కార్యకర్తల కోసం కడప మార్గమధ్యంలో ఫుడ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. దారిపొడవునా తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లతో దాహార్తి తీరుస్తున్నారు. ఈ స్థాయిలో గతంలో ఎన్నడూ ప్రజలు తరలి రాలేదని అభిమానులు చెబుతున్నారు. ప్రజలు భారీగా రావడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటి సారిగా అభివర్ణిస్తున్నారు. దాదాపు 140 ఎకరాల సభా ప్రాంగణం మొత్తం ప్రజలతో కిక్కిరిసిపోయింది. ఇసుకేస్తే రాలనంతగా పసుపు సైన్యం తరలివచ్చింది.

































# గుజరాత్, ముంబయి
# టైటిల్ గెలిచే ఛాన్సుందా?



ఐపీఎల్ 2025 సీజన్ తుది దశకు వచ్చేసింది. నేటి (మే 29) నుంచే ప్లే ఆఫ్స్ మొదలుకానున్నాయి. నేడు ముల్లాన్‌పూర్ వేదికగా క్వాలిఫయర్-1 జరగనుంది. పాయింట్ల పట్టికలో టాప్-2లో నిలిచిన పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఈ కీలక పోరులో తలపడనున్నాయి. ఇందులో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు దూసుకెళ్తుంది. ఇక, రేపు (మే 30న) ముల్లాన్‌పూర్‌లో గుజరాత్ టైటాన్స్, ముంబయి ఇండియన్స్ ఎలిమినేటర్ మ్యాచ్ ఆడనున్నాయి. క్వాలిఫయర్-1లో ఓడిన జట్టు, ఎలిమినేటర్ విజేత.. ఫైనల్‌లో చోటు కోసం క్వాలిఫయర్ 2లో పోటీపడతాయి.

### 14 సీజన్లలో ఒక్కసారే..

ఐపీఎల్‌లో 2011లో ప్లే ఆఫ్స్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. అప్పటినుంచి ఇప్పటివరకు 14 సీజన్లు జరిగాయి. అయితే, ఒక్కసారి మాత్రమే ఎలిమినేటర్ మ్యాచ్ ఆడిన జట్టు ఫైనల్ వరకు వెళ్లి టైటిల్ సాధించింది. మిగతా 13 సీజన్లలో టాప్-2లో నిలిచిన జట్లే ఛాంపియన్‌గా నిలిచాయి. 2016లో డేవిడ్ వార్నర్ సారథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ సంచలనం సృష్టించింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో కోల్‌కతాను మట్టికరిపించిన హైదరాబాద్.. క్వాలిఫయర్-2లో గుజరాత్ లయన్స్‌కూ షాక్ ఇచ్చి ఫైనల్‌కు దూసుకెళ్లింది. టైటిల్ పోరులో బెంగళూరుపై 8 పరుగుల తేడాతో విజయం సాధించి కప్పు ఎగరేసుకుపోయింది.

### ముంబయికి కలిసిరాని 3, 4


పాయింట్ల పట్టికలో మూడు, నాలుగు స్థానాల్లో నిలిచి ఫైనల్ వరకు వెళ్లి టైటిల్ సాధించడం అంత ఈజీ కాదు. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో (ఎలిమినేటర్, క్వాలిఫయర్ 2, ఫైనల్) విజయం సాధిస్తేనే టైటిల్ దక్కుతుంది. అందువల్ల ముంబయి, గుజరాత్ (%+బయిఖతీఫ్ ుఞఖఅం%) ఛాంపియన్‌గా నిలవాలంటే సర్వశక్తులూ ధారపోయాల్సిందే. ముంబయి ఇండియన్స్ విషయానికొస్తే 10 సార్లు ప్లే ఆఫ్స్‌కు చేరి ఐదుసార్లు ఛాంపియన్ అయింది. ఒకసారి రన్నరప్‌గా నిలిచింది. కానీ, గత చరిత్రను చూస్తే మాత్రం మూడు, నాలుగు స్థానాలు ముంబయికి అస్సలు కలిసిరావడం లేదు. రెండుసార్లు (2011, 2012) ఇలా క్వాలిఫయర్-2లోకి అడుగుపెట్టినా సరే.. ఫైనల్‌కు వెళ్లలేకపోయింది. ఇక మరో రెండుసార్లు (2014, 2023) ఎలిమినేటర్‌లోనే ఇంటిముఖం పట్టింది. ఇక, ఆడిన తొలి సీజన్ (2022)లోనే ఛాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించిన గుజరాత్ టైటాన్స్.. తర్వాత సీజన్‌లో రన్నరప్‌గా నిలిచింది. గతేడాది మాత్రం ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది.

### కొత్త ఛాంపియన్‌ను చూస్తామా?

ముంబయి, గుజరాత్ జట్లలో ఏదో ఒక టీమ్ క్వాలిఫయర్-2 ఆడుతుంది. క్వాలిఫయర్-1లో ఓడిన జట్టు.. ముంబయి/గుజరాత్‌పై గెలిస్తే ఈసారి కొత్త ఛాంపియన్‌ను చూస్తాం. ఎందుకంటే పంజాబ్ కింగ్స్, ఆర్సీబీ ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేదు. బెంగళూరు మూడు సార్లు (2009, 2011, 2016) ఫైనల్‌కు చేరినా టైటిల్‌ను ముద్దాడలేకపోయింది. పంజాబ్ ఈ సీజన్ కంటే ముందు ఒక్కసారే (2014) ఫైనల్‌కు చేరింది. అప్పుడు కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో ఓడిపోయి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మళ్లీ ఇన్నాళ్లకు టైటిల్ పోరుకు అర్హత సాధించింది.

## ఐపీఎల్ అభిమానులకు శుభవార్త..

# క్వాలిఫయర్-1 మ్యాచ్‌కు వరుణుడి ఆటంకం లేనట్లే!



ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా చండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు క్వాలిఫయర్- 1లో మరికొన్ని గంటల్లో తలపడనున్నాయి. 11 సంవత్సరాల తర్వాత పంజాబ్ కింగ్స్.. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో మొదటిసారి ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టింది. ఈ జట్టు ఇంతకు ముందు చివరగా 2014లో ప్లేఆఫ్స్‌నకు చేరుకుంది. మరో వైపు పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉన్న ఆర్సీబీ కూడా బలంగా కనిపిస్తోంది. క్వాలిఫయర్- 1 నేపథ్యంలో అభిమానులందరి కళ్లు వరుణుడి మీదే ఉన్నాయి. ఈ సీజన్‌లో వాన వల్ల పలు మ్యాచ్‌లు ప్రభావితమ్యాయి. కానీ ఈ సారి అలాంటి ముప్పేమీ ఉండబోదని వాతావరణ శాఖ భరోసా ఇస్తోంది. 'ముల్లాన్‌పూర్‌లో వర్షం కురిసే అవకాశాలు దాదాపు లేవు. ఉష్ణోగ్రతలు 26 డిగ్రీలకు అటూఇటుగా నమోదయ్యే అవకాశం ఉంది. మ్యాచ్ సమయంలో గాలి వీచే వేగం గంటకు 20కి.మీ.ల వరకు ఉండనుంది' అని వాతావరణ నివేదిక చెబుతోంది. ఇవేవీ మ్యాచ్‌కు ఆటంకం కాదు. దీంతో పంజాబ్ కింగ్స్, ఆర్సీబీ మధ్య జరిగే రసవత్తర పోరును వీక్షించాలని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. క్వాలిఫయర్ - 1 మ్యాచ్‌కు రిజర్వ్ డే లేని నేపథ్యంలో ఇది నిజంగా శుభపరిణామమే.

ఒక వేళ వర్షం కురిసి, మ్యాచ్ రద్దైతే మాత్రం పంజాబ్ కింగ్స్ నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. అప్పుడు ఆర్సీబీ.. ముంబయి, గుజరాత్ మధ్య జరగనున్న ఎలిమినేటర్‌లో గెలిచిన జట్టుతో క్వాలిఫయర్- 2లో తలపడాల్సి వస్తుంది. అందులో గెలిస్తేనే ఫైనల్‌లో తలపడే అవకాశాన్ని బెంగళూరు చేజిక్కించుకుంటుంది. క్వాలిఫయర్- 1 మ్యాచ్‌కు వర్ష సూచనలు లేకపోవడం ఒక విధంగా ఆర్సీబీకి కలిసి వచ్చే అంశమే. ఈ అవకాశాన్ని ఆర్సీబీ ఎంతవరకు సద్వినియోగం చేసుకుంటుందో మరి కాసేపట్లోనే తేలనుంది.

# ధోనీ మూడ్ సరిగా లేనప్పుడు అతడితో మాట్లాడటానికి ఇప్పటికీ సంకోచిస్తా: రవీంద్ర జడేజా





భారత మాజీ దిగ్గజ క్రికెటర్ ధోనీని తాను మొదటిసారి కలిసినప్పటి సంఘటనను టీమ్ఇండియా ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా గుర్తుచేసుకున్నాడు. మొదటిసారి తను ధోనీని కలవడానికి సంకోచించినట్లు వెల్లడించాడు. ధోనీ సరైన మూడ్‌లో లేనప్పుడు ఇప్పటికీ అతడితో మాట్లాడాలంటే కాస్త బెరుకుగానే ఉంటుందని జడేజా వివరించాడు. తాను తొలిసారిగా 2005లో ధోనీని కలిసిన నాటి సంగతులను భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ నిర్వహిస్తున్న యూట్యూబ్ ఛానల్‌తో పంచుకున్నాడు.

'నేను మొట్టమొదటిసారి ఎంఎస్ ధోనీని చెన్నైలో 2005లో ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా కలిశాను. నేను ముంబయి నుంచి విమానంలో వస్తున్నాను. అదే ఫ్లైట్‌లో ధోనీ కూడా ప్రయాణించాడు. నేను ఎకానమీ క్లాస్‌లో కూర్చుంటే, అతడు బిజినెస్ క్లాస్‌లో ఉన్నాడు. అక్కడున్నవాళ్లంతా ధోనీ ఈ విమానంలోనే ముందు కూర్చుని ఉన్నాడని అన్నారు. కానీ నేను అతణ్ని కలవడానికి సంకోచించాను. అంతెందుకు నేను ఇప్పటికీ ధోనీ సరైన మూడ్‌లో లేనప్పుడు అతడితో మాట్లాడటానికి కూడా ఇబ్బంది పడతాను. నిజానికి అతడు ఏమీ అనడు. కానీ ధోనీ ముఖంలో తాను మాట్లాడే మూడ్‌లో లేదన్న విషయం కనిపిస్తుంది' అని జడేజా వివరించాడు.

అలాగే తాను మొదటిసారి ధోనీని కలిసినప్పుడు ఏం జరిగిందో జడేజా చెప్పాడు. 'ఆ సమయంలో నేను పిల్లాడిని! ధోనీని మొదటిసారి విమానంలో చూశాను. అప్పుడు అతడు పొడవైన జుట్టుతో ఉన్నాడు. మా మేనేజర్.. ఇప్పుడు మనం ఎయిర్‌పోర్ట్ నుంచి ధోనీతో కలిసి టీమ్ అంతా హోటల్‌కు వెళ్లాలి అని చెప్పాడు. అప్పుడు నాకు కాస్త బెరుకుగా అనిపించింది. అతడితో నేను ఎలా వెళ్లేది. అతడు ధోనీ కదా! అని సంకోచించా. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఎంఎస్ ధోనీ తన ఫోన్‌ను పారేసుకున్నాడు. దానికోసం ఆయన వేచి చూస్తున్నాడు. అక్కడినుంచి వెళ్లిపోవడానికి ఇదే సరైన సమయం అని భావించా. ఆ సమయంలో నేను ధోనీతో అసలు ఏం మాట్లాడాలి? అని ఆలోచించేవాణ్ని' అని జడేజా ఆరోజు జరిగిన సంఘటనను పూస గుచ్చినట్లుగా వివరించాడు. ఎంఎస్ ధోనీ సారథ్యంలో రవీంద్ర జడేజా టీమ్ఇండియాతో పాటు, చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోనూ ఆడాడు. 2018, 2021, 2023లో చెన్నై.. ఐపీఎల్ టోర్నీ గెలవడంలోనూ జడేజా కీలకపాత్ర పోషించాడు. 2023 ఫైనల్‌లో అయితే మోహిత్ శర్మ బౌలింగ్‌లో జడేజా చివరి రెండు బంతుల్లో పది పరుగులు చేశాడు. ఇలా చెన్నై జట్టు అయిదోసారి ఐపీఎల్ టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. కానీ ప్రస్తుత సీజన్‌లో మాత్రం జడేజా అంతగా రాణించలేదు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు కూడా ప్లేఆఫ్స్‌నకు చేరకుండానే నిష్క్రమించింది.

# 9 ఏళ్ల తర్వాత టాప్-2లోకి..

## ప్లే ఆఫ్స్‌లో బెంగళూరు రికార్డు ఎలా ఉందంటే?



**ప్రతి ఐపీఎల్ సీజన్ ఆరంభంలో ఆర్సీబీ అభిమానుల నోటి నుంచి ఎక్కువగా వినిపించే మాట.. 'ఈసాలా కప్ నమదే' (ఈసారి కప్ మనదే). ఈ సారి ఆ కల నెరవెరే అవకాశముంది. ఐపీఎల్ 2025కు ముందు జట్టులో భారీ మార్పులు చేసిన ఆర్సీబీ అన్ని విభాగాల్లో దుర్భేద్యంగా తయారైంది. లీగ్ ఆరంభం నుంచే మేటి జట్లకు షాకిస్తూ వరుసగా విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో టాప్-2లో నిలిచింది. తొమ్మిదేళ్ల తర్వాత బెంగళూరు క్వాలిఫయర్-1కు అర్హత సాధించడం విశేషం. మునుపెన్నడూ లేనంత విధంగా బలంగా కనిపిస్తోన్న బెంగళూరు ఈ సారి టైటిల్ కరవును తీర్చుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఫైనల్ చేరడానికి రెండు అవకాశాలుండటం ఆ జట్టుకు కలిసొచ్చే అంశం. మరి ఇప్పటివరకు ఆర్సీబీ ఎన్నిసార్లు ప్లే ఆఫ్స్ చేరింది, ఎలాంటి ప్రదర్శన చేసిందో ఓ లుక్కేద్దాం.**

### మూడేళ్లలో రెండుసార్లు మిస్

తొలి నాలుగు సీజన్లలో మూడు సార్లు ప్లేఆఫ్‌కు చేరిన ఆర్సీబీ.. మూడేళ్ల వ్యవధిలో రెండుసార్లు త్రుటిలో టైటిల్‌ను చేజార్చుకుంది. అప్పట్లో చెన్నై తర్వాత అత్యంత విజయమైన జట్టు బెంగళూరే. తొలి సీజన్‌లో ఏడో స్థానంలో నిలిచిన ఆ జట్టు తర్వాతి సీజన్ (2009)లో అద్భుత ప్రదర్శన చేస్తూ ఫైనల్‌కు చేరింది. సెమీ ఫైనల్‌లో చెన్నైని ఆరు వికెట్ల తేడాతో ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. కానీ, టైటిల్ పోరులో హైదరాబాద్ చేతిలో 6 పరుగుల తేడాతో ఓటమిపాలై కప్‌ను అందుకోలేకపోయింది. అనంతరం మూడో సీజన్ (2010)లోనూ మెరుగైన ప్రదర్శనతో సెమీస్‌కు చేరింది. అయితే ముంబయి (%వీబఎమ్ఖఱ ×అుఞఖఅం%) చేతిలో 35 పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసి టోర్నీ నుంచి వైదొలిగింది. 2011లో బెంగళూరు జూలు విదిలించింది. గేల్ విధ్వంసంతో వరుసగా ఏడు విజయాలు సాధించింది. 19 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ప్లేఆఫ్‌కు చేరింది. అయితే క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో చెన్నై చేతిలో ఆరు వికెట్ల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. అనంతరం ముంబయితో జరిగిన క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో అదరగొట్టింది. 43 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్‌కు చేరింది. కానీ, చెన్నై (%జప్తవఅఖఱ ాబజూవతీ ఖఱఅస్త్రం%) చేతిలో బెంగళూరుకు మరోసారి భంగపాటు తప్పలేదు. తుది పోరులో 58 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసి టైటిల్‌ను మరోసారి కోల్పోయింది. 2012, 2013, 2014 సీజన్లలో బెంగళూరు లీగ్ దశను దాటలేకపోయింది. కానీ, 2015లో మూడో స్థానంలో నిలిచి ప్లేఆఫ్‌కు చేరింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. కానీ, చెన్నైతో జరిగిన క్వాలిఫయర్-2లో ఆర్సీబీకి చుక్కెదురైంది.

### సన్ 'రైజింగ్'తో మూడో'సారీ'

కోహ్లీ భీకర ఫామ్ కొనసాగిండంతో 2016లో ఆర్సీబీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. క్వాలిఫయర్-1లో టేబుల్ టాపర్ గుజరాత్ లయన్స్‌ను మట్టికరిపించి టైటిల్‌పోరుకు అర్హత సాధించింది. అయితే ఆఖరిమెట్టుపై బెంగళూరు మరోసారి బోల్తా పడింది. ఫైనల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో 8 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. మొదట బ్యాటింగ్ చేసిన వార్నర్ సేన 209 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. గేల్, కోహ్లీ మెరుపు అర్ధశతకాలతో ఘనమైన ఆరంభాన్ని అందించడంతో బెంగళూరు గెలుపు దిశగా సాగింది. కానీ వారిద్దరు ఔటవ్వడంతో 200 పరుగులకు పరిమితమై మూడోసారి త్రుటిలో టైటిల్‌ను మిస్ చేసుకుంది.

CINIMA NEWS
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# ప్రముఖ నటుడు రాజేశ్ ఇకలేరు



సీనియర్ నటుడు రాజేశ్ కన్నుమూతదక్షిణాది చిత్రసీమలో తన విలక్షణమైన నటనతో గాఢ ముద్ర వేసిన ప్రముఖ నటుడు రాజేశ్ మంగళవారం కన్నుమూశారు. చెన్నై రామాపురంలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచిన ఆయన మరణవార్తతో చిత్రపరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల కథనం మేరకు, రాజేశ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.ఆయన భౌతికకాయాన్ని అభిమానుల సందర్శనార్థం రామాపురంలోని నివాసంలో ఉంచారు.ఉపాధ్యాయునిగాప్రారంభం..తమిళనాడు లోని తిరువారూర్ జిల్లా, మన్నార్‌గుడిలో 1949 డిసెంబర్ 20న రాజేశ్ జన్మించారు. తొలుత ఉపాధ్యాయుడిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించిన ఆయన, నటనపై ఉన్న ఆసక్తితో సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. ఆయనకు కుమార్తె దివ్య, కుమారుడు దీపక్ ఉన్నారు. ఆయన భార్య జోన్ సిల్వియా గతంలోనే మరణించారు. ప్రజల సందర్శనార్థం రాజేశ్ భౌతికకాయాన్ని రామాపురంలోని ఆయన నివాసంలో ఉంచారు.ప్రఖ్యాత దర్శకుడు కె. బాలచందర్ దర్శకత్వంలో 1974లో వచ్చిన 'అవళ్ ఒరు తొడర్‌కతై' చిత్రంతో రాజేశ్ నటుడిగా అరంగేట్రం చేశారు. ఆ తరువాత, రాజ్‌కన్ను నిర్మించిన 'కన్ని పరువత్తిలే' (1979) చిత్రంలో కథానాయకుడిగా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా ఆయన కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచింది.గంభీర స్వరానికి డబ్బింగ్ రంగంలో ఆదరణదాదాపు ఐదు దశాబ్దాల తన సినీ ప్రస్థానంలో తమిళం, తెలుగు, మలయాళం తదితర దక్షిణాది భాషా చిత్రాల్లో అనేక రకాల పాత్రలు పోషించారు. కథానాయకుడిగా, సహాయ నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఇలా అన్ని రకాల పాత్రల్లోనూ ఒదిగిపోయి, తన నటనతో ప్రేక్షకులను మెప్పించారు. ఆయన భావయుక్తమైన నటన, తెరపై గంభీరమైన ఉనికి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.నటనలోనే కాకుండా, డబ్బింగ్ కళాకారుడిగా కూడా రాజేశ్ తన ప్రతిభను చాటుకున్నారు. తన గంభీరమైన, ప్రత్యేకమైన స్వరంతో అనేక పాత్రలకు జీవం పోశారు. దిగ్గజ దర్శకుడు కె. బాలచందర్‌తో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉంది.సినీ ప్రముఖుల నుండి సంతాప సందేశాలురాజేశ్ మృతి పట్ల తమిళ చిత్ర పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతిలో మునిగిపోయింది. ప్రముఖ నటులు, దర్శకులు, నిర్మాతలు ఆయన కుటుంబానికి సానుభూతిని తెలియజేస్తున్నారు. కమల్ హాసన్, రజనీకాంత్, సూర్యా, మణిరత్నం తదితరులు సోషల్ మీడియాలో తనతో ఉన్న అనుబంధాలను గుర్తుచేసుకుంటూ రాజేశ్‌కు నివాళులు అర్పించారు. "రాజేశ్‌గారి మృదువైన స్వభావం, నాటకీయమైన నటనా శైలి ఇప్పటికీ మన మదిలో నిలిచిపోతుంది" అని పలువురు వ్యాఖ్యానించారు.

# ఆగస్టు 27న ప్రేక్షకుల ముందుకు రానున్న రవితేజ 'మాస్ జాతర'




వినాయక చవితికి మాస్ జాతర.. రవితేజ మరోసారి మాస్ మాస్ రేంజ్‌లోకి!మాస్ మహారాజా రవితేజ అభిమానులకు ఒక మంచి వార్త. భాను భోగవరపు దర్శకత్వంలో రవితేజ హీరోగా వస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. "మనదే ఇదంతా" అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. తాజాగా చిత్రబృందం వినాయక చవితి పండుగకు ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఆగస్టు 27న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాకు సంబంధించిన ఓ నూతన పోస్టర్‌ను కూడా వదిలింది. పోస్టర్ చూసిన ఫ్యాన్స్ ఫుల్ ఖుష్. "ఈ వినాయక చవితికి థియేటర్స్‌లో మాస్ జాతరే!" అంటూ సోషల్ మీడియాను హోరెత్తిస్తున్నారు.శ్రీలీలతో రవితేజ %-% మళ్లీ ఆ కాంబినేషన్ మెరుపులు?ఈ చిత్రంలో రవితేజ సరసన నటిస్తోంది శ్రీలీల. వీరిద్దరూ గతంలో 'ధమాకా' సినిమాలో కలిసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆ సినిమాలో వారి కెమిస్ట్రీ, ఎనర్జీ, పాటలు, కామెడీ అన్నీ అభిమానులకు తెగ నచ్చాయి. ఇప్పుడు మళ్లీ అదే జంట 'మాస్ జాతర'లో కలవడం, ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. సూపర్ హిట్ జోడీ మళ్లీ తెరపై సందడి చేయబోతుండటంతో అభిమానుల్లో ఊపే వేరుగా కనిపిస్తోంది. శ్రీలీల హైపర్ ఎనర్జీ, డ్యాన్స్‌లకు మంచి ఫాలోయింగ్ ఉన్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో కూడా ఆమె పాత్రకు మంచి స్కోప్ ఉన్నట్టు తెలుస్తోంది.

# స్పోర్ట్స్ కార్ కొన్న యానిమల్ బ్యూటీ! దాని ధర కోట్లలోనే..




ఈ అఫీషియల్ న్యూస్‌తో నెట్టింట వైరల్ అయిన ఈమె.. తాజాగా మరో న్యూస్‌తో కూడా సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతున్నారు.త్రిప్తి కూడా బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ మాదిరిగానే తాజాగా ఓ స్పోర్ట్స్ కార్ తీసుకున్నారు. ఇటీవల బ్రాండ్ న్యూ బ్లూకలర్ పోర్షే 911 కారెరా కారును కొనుగోలు చేశారు. ఇక ఆటో మొబైల్స్ పోర్టల్స్ ప్రకారం ఈ కారు ధర సుమారు 2.11 కోట్ల రూపాయలు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలతోనే ఈ బ్యూటీ బీ టౌన్‌లో హాట్ టాపిక్ అవుతోంది.

# అల్లు అర్జున్ కి గద్దర్ అవార్డు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "గద్దర్ ఫిల్మ్ అవార్డులు" ఈ సంవత్సరం ప్రత్యేకంగా నిర్వహించబోతున్న సంగతి తెలిసిందే. ఈ అవార్డుల్లో స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ కి గౌరవనీయమైన అవార్డు లభించటం సినీ అభిమానుల మధ్య హర్షాతిరేకాలను కలిగించింది. 'గద్దర్ ఫిల్మ్ అవార్డుల' ను జ్యూరీ ఛైర్‌పర్సన్, ప్రముఖ నటి జయసుధ ప్రకటించారు. గురువారం ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుతో కలిసి ఆమె మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు.గద్దర్ పేరు ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవతెలంగాణ రాష్ట్రంలో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ప్రముఖ ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ స్మృతిని నిలుపుకోవడానికి ఈ అవార్డులు ఏర్పాటు చేశారు. సుమారు 14 సంవత్సరాల విరామం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఈ సినిమా పురస్కారాలను ప్రకటించడం గమనార్హం. ఇక 2024 సంవత్సరానికి సంబంధించి అన్ని విభాగాల్లోనూ అవార్డులను ప్రకటించారు. ఈ పురస్కారాల్లో తెలుగు చిత్రాలతో పాటు ఉర్దూ సినిమాలకు కూడా ప్రాధాన్యత కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.1248 నామినేషనువిస్తృతంగా పరిశీలించిన జ్యూరీఈ అవార్డుల కోసం మొత్తం 1248 నామినేషన్లు వచ్చినట్లు జయసుధ తెలిపారు. వీటిని జ్యూరీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి విజేతలను ఎంపిక చేశారని వివరించారు. 2014 జూన్ నుండి 2023 డిసెంబర్ 31 వరకు విడుదలైన చిత్రాలకు సంబంధించి, ప్రతి ఏడాదీ ఒక ఉత్తమ చిత్రానికి అవార్డు ప్రకటిస్తున్నారు. అలాగే, 2014 నుండి 2023 మధ్య సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలను ఇతర కేటగిరీల కింద పరిగణనలోకి తీసుకున్నారు.అల్లు అర్జున్‌కి గౌరవంఅల్లు అర్జున్ ఇటీవల 'పుష్ప' సినిమాతో దేశవ్యాప్తంగా తన నటనా ప్రతిభను చాటుకున్నారు. తెలుగు సినీ పరిశ్రమను దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన నటుడిగా అవతరించడంతో పాటు, సామాజిక అంశాలపై కూడా స్పందించగల వ్యక్తిగా ఎదిగారు. అతని నటన శైలి, పాత్రల ఎంపిక, మరియు తెలుగు సినిమాకు అందించిన విశేష సేవలను గుర్తించి ఈ గద్దర్ ఫిల్మ్ అవార్డు అందించడం జరిగింది.ప్రత్యేక పురస్కారాలు సినీ లెజెండ్స్ కు ఘనతతెలుగు సినిమా చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చే విధంగా ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటీనటులతో పాటు మొత్తం 21 మందికి వ్యక్తిగత, స్పెషల్ జ్యూరీ అవార్డులను అందించనున్నారు. వీటితో పాటు తెలుగు సినిమాకు సేవలందించిన లెజెండ్స్ గౌరవార్థం ఎన్టీఆర్, పైడి జయరాజ్, బీఎన్ రెడ్డి, నాగిరెడ్డి-చక్రపాణి, కాంతారావు, రఘుపతి వెంకయ్య వంటి వారి పేర్లతో ప్రత్యేక పురస్కారాలను కూడా ఏర్పాటు చేసినట్లు జయసుధ, దిల్ రాజు వెల్లడించారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ తేదీని త్వరలోనే ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# ఖలేజా సినిమాను మహేశ్ బాబు అభిమానులే చంపేశారు.. నిర్మాత సీ కల్యాణ్ షాకింగ్ కామెంట్స్



బాక్సాఫీస్ వద్ద మహేశ్ బాబు అభిమానులే స్వయంగా ఖలేజా సినిమాను చంపేశారంటూ షాకింగ్ కామెంట్స్ చేశారు మూవీ నిర్మాతల్లో ఒకరైన సీ కల్యాణ్. మహేశ్ బాబు అభిమానులు ఇప్పుడు మాత్రం ఆ అభిమానులే బిగ్ స్క్రీన్‌పై మరోసారి సినిమా చూసేందుకు ఎదురుచూస్తున్నారు.

ఖలేజా సినిమాను మహేశ్ బాబు అభిమానులే చంపేశారు.. నిర్మాత సీ కల్యాణ్ షాకింగ్ కామెంట్స్మహేశ్ బాబు కెరీర్‌లో భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టిన సినిమాల్లో ఒకటి ఖలేజా. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 30న రీరిలీజ్ కానుంది. సినిమా విడుదలైన చాలా ఏండ్లు అయినప్పటికీ ఈ చిత్రానికి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. రీరిలీజ్‌పై ప్రీ సేల్స్ అంశంలో సరికొత్త బెంచ్‌మార్క్ నమోదు చేసి అభిమానుల్లో మరింత క్యూరియాసిటీని పెంచేస్తుంది.ఖలేజా రీరిలీజ్ చేస్తున్న నేపథ్యంలో ఇటీవల మూవీ నిర్మాతల్లో ఒకరైన సీ కల్యాణ్ చేసిన బోల్డ్ కామెంట్స్ ప్రస్తుతం నెట్టంట రౌండప్ చేస్తున్నాయి. 2010లో సినిమా ఒరిజినల్ రిలీజ్ గురించి ఆయన మాట్లాడుతూ.. బాక్సాఫీస్ వద్ద మహేశ్ బాబు అభిమానులే స్వయంగా సినిమాను చంపేశారంటూ షాకింగ్ కామెంట్స్ చేశారు. మహేశ్ బాబు అభిమానులు ప్రత్యేక అంచనాలతో థియేటర్లకు వచ్చారు. అయితే సినిమా చూసిన తర్వాత అంచనాలు అందుకోలేకపోవడంతో నిరాశే మిగిలిందంటూ చెప్పుకొచ్చారు. ఆ సమయంలో చాలా మంది అభిమానులు వ్యక్తిగతంగా విమర్శించారు. కానీ ఇప్పుడు మాత్రం ఆ అభిమానులే బిగ్ స్క్రీన్‌పై మరోసారి సినిమా చూసేందుకు ఎదురుచూస్తున్నారు.బహుశా ఖలేజా బాకీ బడ్డది కేవలం 15 ఏండ్ల తర్వాతే తిరిగి చెల్లించాలని రాసి పెట్టుందేమోనన్నారు సీ కల్యాణ్. గతంలో మిస్సయిన గుర్తింపు రీరిలీజ్ అయిన తర్వాత అయినా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో అనుష్కా శెట్టి, ప్రకాశ్ రాజ్, బ్రహ్మానందం, అలీ, సునిల్ ఇతర నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339